ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 189
ఆదివారం 12 జనవరి 2025
చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్
HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD



07

## టీ20 పోరుకు టీమిండియా రెడీ !

# జలసమాధి

## కొండపోచమ్మ సాగర్‌లో మునిగి ఐదుగురి మృతి

- సెల్ఫీ కోసం నీళ్లలో దిగిన ఏడుగురు
- సురక్షితంగా బయటపడ్డ ఇద్దరు 02
- మృతులంతా హైదరాబాద్‌వాసులు
- కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు
- పండుగ పూట విషాదం.. ఘటనపై సీఎం విచారం
- 15లక్షల పరిహారం ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్



సిద్దిపేట, రోమింగ్‌న్యూస్ : వీకెండ్ కావడంతో పర్యటనకు వచ్చి సిద్దిపేట జిల్లా కొండపోచమ్మ సాగర్ జలాశయంలో పడి ఐదుగురు యువకులు దుర్మరణం చెందారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన ఏడుగురు యువకులు కొండపోచమ్మ సాగర్ చూసేందుకు వచ్చారు. ఈ క్రమంలో వాళ్లందరూ డ్యామ్‌లో పడి గల్లంతయ్యారు. ఇది గమనించిన స్థానికులు వారిని రక్షించే ప్రయత్నాలు చేశారు. కానీ అప్పటికే ఐదుగురు యువకులు మరణించారు. మిగిలిన ఇద్దరిని సురక్షితంగా కాపాడగలిగారు. మృతులను ధనుష్, లోహిత్, దినేశ్వర్, సాహిల్, జనిత్‌గా గుర్తించారు.

## త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన



- పార్టీలో పనిచేసిన వారికే పదవులు
- సంక్రాంతి తరవతా మంత్రివర్గ విస్తరణపై స్పష్టత
- దానం నాగేందర్ వ్యాఖ్యలను పరిశీలిస్తున్నాం
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ 02



# నెలాఖరులోగా కొత్త ఉస్మానియా

## శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయండి

- భవిష్యత్‌అవసరాలకు అనుగుణంగా డిజైన్‌మార్చండి
- కార్పొరేట్‌కు దీటుగా ఉండేలా ప్రణాళికలు ఉండాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్ నగరంలో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెలాఖరులోగా శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. శనివారం కొత్తగా నిర్మించబోయే ఉస్మానియా ఆసుపత్రికి సంబంధించిన ప్రణాళికలపై ముఖ్యమంత్రి తన నివాసంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

**హైదరాబాద్, రోమింగ్‌న్యూస్ :** గోషామహల్ పోలీస్ స్టేడియంలో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వీలైనంత త్వరగా వైద్యఆరోగ్య శాఖకు బదిలీ చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్‌లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అధికారులు వివరించిన మ్యాప్‌లలో పలు

మిగతా 2 లో



## 26 నుంచే కొత్త రేషన్ కార్డులు

- కడుపేద వారికి మొదటి ప్రాధాన్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



02

## తెలంగాణలో సంవిధాన్ బచావో

27న హాజరుకానున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే,



02

## సంక్రాంతి ఛార్జీల దోపిడీని సహించం

ప్రైవేట్ ట్రావెల్స్‌కు మంత్రి పొన్నం

## వేణుగోపాలస్వామి.. గోవర్ధనగిరిధారిగా శ్రీలక్ష్మీ నరసింహుడు

యాదగిరిగుట్టలో రెండో రోజుకు చేరిన అధ్యయనోత్సవాలు

03



## టెట్ పరీక్షల్లో గందరగోళం

సర్వర్ డౌన్‌తో 150మంది పరీక్షకు దూరం



02

# సీఎంపై అనుచిత వ్యాఖ్యలు



- భువనగిరి బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి
- కాంగ్రెస్ దాడిని ఖండించిన కెటిఆర్, హరీష్ రావు

**భువనగిరి రోమింగ్‌న్యూస్ :** ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచెల రామకృష్ణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ భువనగిరిలోని బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు. ముఖ్యమంత్రి పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని యువజన కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.

మిగతా 2 లో



## కబ్జాకోరులపై ఉక్కుపాదం మోపండి

- మీవెంట మేం ఉంటాం
- ఇప్పుడైనా ప్రజల కోసం కలిసి పనిచేద్దాం..
- కేంద్ర మంత్రి బండి సంజయ్ 03

## భూభారతితో సమస్యలకు చెక్



02

- కేసీఆర్ ఇష్టానుసారంతో ధరణి సమస్యలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం
12 జనవరి
2025





## టెట్ పరీక్షలో గందరగోళం

**సర్వర్ డౌన్‌తో 150మంది పరీక్షకు దూరం**

**హైదరాబాద్,జనవరి11 :** తెలంగాణలో నిర్వహిస్తోన్న టెట్ పరీక్షలో గందరగోళం నెలకొంది. శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన టెట్ పరీక్షా కేంద్రంలో గందరగోళం చోటు చేసుకుంది. రెండో సెషన్‌లో మధ్యాహ్నం 2గంటలకు మొత్తం 750 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 467 మంది హాజరయ్యారు. సర్వర్ డౌన్ కారణంగా 150 మంది అభ్యర్థులకు టెట్ పరీక్ష నిలిచిపోయింది. దీంతో పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థుల కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. అభ్యర్థులకు మద్దతుగా వారి కుటుంబ సభ్యులు శంషాబాద్- షాబాద్ రహదారిపై బైఠాయించారు.

# బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి



**భువనగిరి/హైదరాబాద్, జనవరి 11:** రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచెల రామకృష్ణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ భువనగిరిలోని బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని యువజన కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసి కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. అనంతరం కా ర్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఇదిలావుంటే యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపై దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. భువనగిరి జిల్లా పార్టీ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, కాంగ్రెస్ పార్టీ దాడులు చేయించడం అత్యంత హేయమైన చర్య అని ఆక్షేపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న భారాస కార్యకర్తలు, నాయకులు, పార్టీ కార్యాలయాలపై దాడులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. పదేళ్లపాటు ప్రశాంతంగా ఉన్న తెలంగాణ.. అరాచకాలకు చిరునామాగా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, కార్యాలయాల జోలికి వస్తే తగిన గుణపాఠం చెబుతామని కేటీఆర్ హెచ్చరించారు. కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ నేతలతో పాటు వారి వెనకున్న నల్గొండ జిల్లా కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రశ్నలకు సమాధానం చెప్పలేక దాడులు చేయించడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. 'ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దాడులు చేసే సంస్కృతిని ఎక్కువైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలతో దాడి చేస్తే, ఆ పార్టీ నాయకులు భౌతికదాడులకు పాల్పడుతున్నారు. ఇదేనా మీ ఇందిరమ్మ రాజ్యం? ఇదేనా మీ ప్రజాపాలన?' అని హరీశ్ రావు ప్రశ్నించారు.



# నెలాఖరులోగా కొత్త ఉస్మానియా కావాలి

మొదటి పేజీ తరువాయి

మార్పులు, చేర్పులను సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలని చెప్పారు. ముఖ్యంగా రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెలాఖరులో శంకుస్థాపన చేసేందుకు వీలుగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



## 26 నుంచే కొత్త రేషన్ కార్డులు

**ఖమ్మం,జనవరి 11 :** కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి. జనవరి 26 నుంచి పేదలందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తామని అన్నారు. గడచిన పదేళ్లలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని..అభివృద్ధి జరగాలంటే ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యం అని ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడ ఎన్నికలు జరిగితే అక్కడ సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. గత ప్రభుత్వం పీకల వరకు అప్పులు పెట్టిపోయినప్పటికీ జనవరి 26న రైతు భరోసా కూడా ఎకరాకు 15 వేలు ఇవ్వబోతున్నామని అన్నారు పొంగులేటి. భూమి లేని ప్రతి నిరుపేద కుటుంబానికి రెండు విడుతలుగా 12 వేలు కూడా ఆరోజే ఇవ్వాబోతున్నామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నియమాలు పాటించకుండా కొండలకు,గుట్టలకు రైతుబంధు ఇచ్చారని అన్నారు. కడుబీదవారికి మొదటి ప్రాధాన్యత గా ఇల్లు ఇవ్వాలని నిర్ణయించామని పొంగులేటి అన్నారు.

# భూభారతితో సమస్యలకు చెక్

- కేసీఆర్ ఇష్టానుసారంతో ధరణి సమస్యలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**నల్గొండ, జనవరి 11:** ఇందిరమ్మ ఇళ్లలో గిరిజనులకు అధిక ప్రాధాన్యం ఇస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తన గెలుపులో గిరిజనుల పాత్ర అధికంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పది శాతం రిజర్వేషన్లు అమల్లోకి రావడంలో తన కృషి కూడా ఉందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి తండాలో గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా భూభారతి చట్టం రూపుదిద్దుకుంటుదన్నారు. భూభారతిని గవర్నర్ కూడా ఆమోదించారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ఇష్టారీతిన ధరణి అమలు చేసిందని.. కనీస నిబంధనలు కూడా లేకుండా ధరణి అమలు చేశారని తెలిపారు. ఫిబ్రవరి 15 లోగా భూ భారతి రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అన్నారు. 2029లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని.. తెలంగాణలో కూడా కాంగ్రెస్ అధికారం లోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు కూడా ఆర్థిక సాయం ఇవ్వడం గొప్ప విషయమని చెప్పారు. అందరికీ తెల్ల రేషన్ కార్డులు అందిస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 కిలోల సన్న బియ్యం ఇస్తుందని ప్రకటించారు. రాజకీయంగా కూడా అందరికీ సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. అటవీ హక్కుల ప్రకారం మిగిలిన గిరిజనులకు భూములు ఇస్తామని మాటిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అందరం కలసి పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఒడిదుడుకుల కారణంగా ఒకటి రెండు హామీల అమలు ఆలస్యం అయిందని అన్నారు. త్వరలోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీ అమలు చేస్తామని స్పష్టం చేశారు. భూమి లేని నిరుపేద కుటుంబాన్ని ఒక యూనిట్‌గా ఎంపిక చేస్తున్నామని అన్నారు. ఆ కుటుంబం తప్పని సరిగా ఉపాధి హామీ పనుల్లో పాల్గొని ఉండాలని.. అంతకుమించి నిబంధనలు ఏమీ ఉండవని చెప్పారు. భూ భారతి విషయంలో చాలా పకడ్బందీగా చర్యలు ఉంటాయని అన్నారు. ఏపీ వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల శాఖను ప్రక్షాళన చేస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లాలో వచ్చిన ఫిర్యాదులు ఆరోపణలపై శాఖా పరమైన విచారణ జరుగుతోందని చెప్పారు. 2025 భూ భారతి చట్టంలో ల్యాండ్ అప్పీలు అథారిటీని ప్రత్యేకంగా అమలు జరుపుతున్నామని చెప్పారు. సమగ్ర సర్వేపై త్వరలోనే స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. 59 జీఓ ద్వారా కోట్లాది రూపాయల విలువైన భూములు పిక్ షర్ట్‌లకు కట్టబెట్టే ప్రయత్నం చేశారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 59 జీఓ పేరుతో జరిగిన దోపిడీని అడ్డుకుంటామని చెప్పారు. ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే చర్యలు ఉంటాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# కొండపోచమ్మ సాగర్‌లో మునిగి ఐదుగురి మృతి

**సిద్దిపేట, జనవరి11 :** సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మార్కూక్ మండలంలోని కొండపోచమ్మ సాగర్ డ్యామ్‌లో పడి హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. నగరానికి చెందిన ఏడుగురు యువకులు శనివారం కొండపోచమ్మ సాగర్‌కు ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. మృతులు హైదరాబాద్‌కు చెందిన ధనుష్ (20), లోహిత్ (17), దినేశ్వర్ (17), జతిన్ (17), శ్రీనివాస్ (17)గా గుర్తించారు. మృతి చెందిన ధనుష్, లోహిత్ ఇద్దరూ సొంత అన్నదమ్ములు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారంతా స్నేహితులు కావడంతో సంక్రాంతి పండుగకు సెలవులు వచ్చేయడంతో ఎక్కడికైనా వెళ్లి ఎంజాయ్ చేయాలని భావించారు. అందుకు వారు సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్ డ్యామ్‌కు బయలుదేరారు. అక్కడా బాగా ఎంజాయ్ చేసేందుకు ఏడుగురు యువకులు తమ తల్లిదండ్రులకు చెప్పి బయలుదేరారు. కానీ అదే వారికి చివరి చూపు అవుతుందని తల్లిదండ్రులు భావించలేదు. సరదాగా గడపడానికి వెళ్లిన వారి వెనకే మృత్యువు ఉందని గ్రహించలేకపోయారు. అనుకున్న విధంగా డ్యాం దగ్గరు చేరుకున్న ఆ ఏడుగురు యువకులు.. ఈత కొట్టాలని భావించారు. అంతా కలిసి డ్యాంలోకి దిగారు.. ఇంతలో ఏం జరిగిందో తెలియదు ఒకరి ఒకరి తర్వాత డ్యాంలో పడి గల్లంతయ్యారు. వీరు మునిగిపోతున్నట్లు గుర్తించిన గత ఈతగాళ్లు వెంటనే రంగంలోకి దిగారు. కానీ అప్పటికే జరగాల్సి నష్టం జరిగిపోయింది. ముందుగా యువకులు గల్లంతయ్యారన్న విషయం తెలిసిన వెంటనే వారి కోసం గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. మొత్తం ఏడుగురు యవకుడు డ్యాంలో పడిపోగా.. వారిలో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. మిగిలిన ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. వారి మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు గజ ఈతగాళ్లు.వీరి మృతి విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సరదాగా వెళ్లిన తమ బిడ్డలు విగతజీవులుగా మారడంతో తల్లిదండ్రుల శోకం వర్ణణాతీతం. యువకుల మృతి వార్త తెలిసి ముషీరాబాద్‌లోనూ విషాదఛాయలు అలముకున్నాయి.

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారం

కొండపోచమ్మ ప్రాజెక్టులో యువకుల గల్లంతైన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. గల్లంతైన వారికోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిస్థితిని అధికారులు దగ్గర ఉండి పర్యవేక్షించాలని, సహాయక చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.


### 15 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి..

సిద్దిపేట జిల్లా కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌లో పడి హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు మృతి చెందడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు అకాల మరణం చెందడం తన మనస్సును కలిచి వేసిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు సూచించారు. పండుగ వేళ బిడ్డల్ని కోల్పోయి బాధలో ఉన్న కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో సంవిధాన్ బచావో కార్యక్రమం

**హైదరాబాద్, జనవరి 11 :** కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఈనెల 27న తెలంగాణ పర్యటనకు రానున్నారని కాంగ్రెస్ హైకమాండ్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావడంతో ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నిర్ణయించింది. ఈ సందర్భంగా తెలంగాణలో జరగనున్న 'సంవిధాన్ బచావో' ప్రదర్శనలో వారు పాల్గొనబోతున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల జరిగిన సమావేశంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరసనలు వ్యక్తం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా, జనవరి 26, 2024 నుంచి జనవరి 26, 2026 వరకు దేశవ్యాప్తంగా 'సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర'ను చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ యాత్రను విజయవంతం చేయడానికి అన్ని స్థాయిల కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. మహేశ్‌కుమార్ గౌడ్ మంగళవారం పార్టీ శ్రేణులకు రాసిన లేఖలో, రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ చొరవ తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పార్టీ విస్తృత కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ పర్యటనతో తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు. 'సంవిధాన్ బచావో' ఉద్యమానికి ఈ పర్యటన కీలక మైలురాయిగా నిలుస్తుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనబోతున్నారు.

## సంక్రాంతి ఛార్జీల దోపిడీని సహించం



**హైదరాబాద్, జనవరి 11 :** సంక్రాంతి పండగ సమయంలో ప్రయాణికులను ఇబ్బంది పెడితే సహించబోమని, బస్సులను సీజ్ చేస్తామని ప్రైవేటు బస్సుల యజమానులను మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. అదనపు ఛార్జీల పేరిట ప్రయాణికులను దోపిడీకి గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రెగ్యులర్ ఛార్జీలనే వసూలుచేయాలని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. 'ప్రైవేటు బస్సుల యజమానులు అదనంగా ఛార్జీలు వసూలు చేస్తే ప్రయాణికులు రవాణా శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి. ఆర్టీసీ అధికారులు రహదారులపైనే ఉండి తనిఖీలు చేపట్టాలి. సంక్రాంతి పండగ నేపథ్యంలో టీజీఎస్‌ఆర్టీసీ 6,432 ప్రత్యేక బస్సులు నడిపిస్తోంది. అవసరమైతే మరిన్నింటిని నడిపేందుకు ఆర్టీసీ అధికారులు సిద్ధంగా ఉండాలి' అని పేర్కొన్నారు. ప్రయాణికుల నుంచి అదనపు ఛార్జీలు వసూలు చేసే ప్రైవేట్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. 'పర్మిట్ నిబంధనలను ఉల్లంఘించినా, సరకు రవాణా చేసినా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై చర్యలు తప్పవు. ఈ విషయమై వారం రోజుల పాటు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తాం. ప్రైవేటు బస్సులపై ఇప్పటికే 150 కేసులు నమోదు చేశాం' అని వివరించారు.

# త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

**హైదరాబాద్,జనవరి11 :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ వెల్లడించారు. నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి పేరు చాలా మంది చెప్పారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రపక్షాలకు మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలను పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరి రిపోర్టు కేసీ వేణుగోపాల్ వద్ద ఉందన్నారు. పార్టీ నేతలందరూ వచ్చే 20 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని గట్టిగా హెచ్చరించారని చెప్పారు. ఈ నెలాఖరుకు పార్టీలో అన్ని కమిటీలు వేస్తామని, పనిచేసిన వారందరికి పదవులు ఇస్తామని స్పష్టం చేశారు. పనిచేసిన నాయకులకే పదవులు వస్తాయన్నారు. కార్పొరేషన్ పదవుల భర్తీ ఈ నెలాఖరుకి పూర్తవుతుందని తెలిపారు.తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక కామెంట్స్ చేశారు. మంత్రి వర్గ ఎప్పుడు ఉంటోందో తేల్చిచెప్పారు. అలాగే కాంగ్రెస్‌లో చేరికలు కూడా జోరుగా ఉంటాయన్నారు. గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు సంబంధించి ప్రకటన ఉంటుందని తెలిపారు. సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ చేస్తామని ప్రకటించారు. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేస్తున్నామని.. సంకాంత్రి తర్వాత చేరికలు ఉంటాయని వెల్లడించారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్ర పక్షాలకు మద్దతు ఇస్తామన్నారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, మాజీ అధికారి గంగాధర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు.కాగా.. గత కొద్దినెలలుగా తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది డిసెంబర్‌లోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని అంతా భావించారు. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ పెద్దలతో చర్చలు కూడా జరిపారు. డిసెంబర్‌లోనే మంత్రి వర్గ విస్తరణ ఖాయమని అప్పట్లో మంత్రులు కూడా ప్రకటనలు చేశారు. యితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా.. ఈ నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వెళ్లనున్నారు. ఈ క్రమంలో రేవంత్ పర్యటన నేపథ్యంలో కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం కానుందని కాంగ్రెస్ వర్గాలే చెప్పుకొచ్చారు. ఇప్పుడు అనూహ్యంగా టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్వయంగా మంత్రి వర్గ విస్తరణపై ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం
12 జనవరి
2025





# వేణుగోపాలస్వామి.. గోవర్ధనగిరిధారిగా శ్రీలక్ష్మీ నరసింహుడు



## యాదగిరిగుట్టలో రెండో రోజుకు చేరిన అధ్యయనోత్సవాలు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అధ్యయనోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజైన శనివారం వేణుగోపాలస్వామిగా, గోవర్ధనగిరిధారిగా నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. సన్నాయి వాయిద్యాలు, మేళ తాళాల హోరులో వేదపారాయణాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ వేణుగోపాలస్వామి, గోవర్ధనగిరిధారి అలంకార సేవలను అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూలవరులకు నిత్య కైంకర్యాలు నిర్వహించిన అనంతరం.. స్వామివారిని వేణుగోపాలస్వామి అలంకారంలో అందంగా ముస్తాబు చేసి ప్రధానాలయ మాడవీధుల్లో ఊరేగించారు. వజ్ర వైఢూర్యాలు, బంగారు ఆభరణాలు ధరించిన నారసింహుడు.. లక్ష్మీసమేతుడై మాడవీధుల్లో వహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. అలాగే సాయంత్రం నిత్యారాధనలు ముగిసిన అనంతరం.. గోవర్ధనగిరిధారి అలంకారంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి ఆలయ తిరువీధుల్లో విహరింపజేశారు. ఆలయ పురవీధుల్లో ఊరేగుతూ స్వామివారు భక్తులకు తరింపజేశారు. అనంతరం ప్రత్యేక వేదికపై స్వామివారిని అధిష్టింపజేసి గోవర్ధనగిరిధారి అవతార విశిష్టతను భక్తులకు అర్చకులు ప్రవచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భాస్కర్ రావు, డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

### నేడు రామావతారం, వేంకటేశ్వరస్వామి అలంకార సేవలు

అధ్యయనోత్సవాల్లో భాగంగా మూడోరోజైన ఆదివారం ఉదయం రామావతారం, సాయంత్రం వేంకటేశ్వరస్వామి అలంకార సేవలు చేపట్టనున్నారు. నారసింహుడి అలంకార సేవలను ఆలయ మాడవీధుల్లో విహరింపజేసి భక్తులకు దర్శనం కల్పించనున్నారు.





# బోడుప్పల్ లోటస్ ల్యాప్ లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

బొడుప్పల్, రోమింగ్ న్యూస్: బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగవల్లులతో పాఠశాల ప్రాంగణం అంతా కోలాహలం నెలకొన్నది. పాఠశాల చైర్మన్ డాక్టర్ లయన్ విద్యారత్న కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి దీప ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన తన సందేశంలో విద్యార్థుల ఆరోగ్యం విజయం సాంస్కృతిక విలువలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని మరియు వారి ప్రతిభను వెలుగులోనికి తీసుకురావడమే పాఠశాల లక్ష్యం అని చెప్పారు. భోగి వేడుకలలో భాగంగా చిన్నపిల్లలకు భోగి పళ్ళు పోసి ఆశీర్వదించడం జరిగింది. ఈ ఆనవాయితీ పిల్లలకు ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు కలిగిస్తుందని పెద్దలు విశ్వసిస్తారు. ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి పాల్గొని తన చేతుల మీదుగా చిన్నపిల్లలకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించడము జరిగింది. అలాగే విద్యార్థులకు తల్లిదండ్రులకు రంగుల పోటీలు నిర్వహించడము జరిగింది. ఈ రంగవల్లులలో ప్రధమ బహుమతి యశ్వంత్ %+%-7 మదర్, ద్వితీయ బహుమతి మీనాక్షిజి %+%-6 మదర్ మరియు తృతీయ బహుమతి శర్వ %+%-1 మదర్ లకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. అలాగే విద్యార్థులు కూడా పాఠశాల ప్రాంగణంలో అందమైన రంగవల్లులు వేయడం జరిగింది. విద్యార్థులకు కూడా ప్రధా మాద్రి బహుమతులను గోపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు సంక్రాంతి యొక్క గొప్పతనాన్ని వివరించి నృత్యాలు నాటకాలతో అలరించారు. విద్యార్థులు అందరూ సాంప్రదాయ దుస్తులతో వచ్చి పాఠశాల ప్రాంగణమంతా అలరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని వేడుకలను మరింత శోభాయ మానం చేశారు. బోడుప్పల్ లోటస్ ల్యాబ్ పబ్లిక్ పాఠశాలలో ప్రతి విద్యార్థికి విద్యతోపాటు సాంస్కృతి సాంప్రదాయాలు సమాజ పోకడలను విలువలను నేర్పించడం పాఠశాల యొక్క లక్ష్యం.









ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం
12 జనవరి
2025





# అవినీతికి పాల్పడలేదని వీరభద్రస్వామిపై ప్రమాణం చేస్తావా.?

**ఎమ్మెల్యే అయిలయ్యకు సవాల్ విసిరిన డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్ రెడ్డి**

**మాజీ ఎమ్మెల్యే సునీతపై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించం**

**డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: భూదందాలు చేస్తూ ఎమ్మెల్యే అవినీతికి పాల్పడుతున్నారని సొంతపార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన ఆరోపణల ఆధారంగానే ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఆరోపణలు చేస్తే.. మహిళా అని కూడా చూడకుండా గొంగిడి సునీతను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నోటికొచ్చినట్లు ఇష్టానుసారంగా మాట్లాడడం ఎంతవరకు కరెక్ట్ అని ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం యాదగిరిగుట్టలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ళు ఎమ్మెల్యేగా పనిచేసిన తన భార్య అయిన సునీతను మహిళ అనే కనీస గౌరవం లేకుండా.. అది, ఇది అని వర్ణిస్తూ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మతిపోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తాను ఎమ్మెల్యే అనే విషయం కూడా మర్చిపోయిన బీర్ల అయిలయ్య.. సోయి లేకుండా గొంగిడి సునీత మెంటల్ ది, ఎర్రగడ్డ పిచ్చాసుపత్రికి రిఫర్ చేస్తా ట్రీట్‌మెంట్ చేపించుకో అని దిగజారి మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గొంగిడి సునీత చేసిన ఆరోపణలు అవాస్తవమని నిరూపించుకోలేక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ఫ్రస్టేషన్ ఎక్కువై భయంతో నోటికి పని చెప్తున్నారని ఎద్దేవా చేశారు. తిట్ల పురాణంలో సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదర్శంగా తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే బూతు పురాణం కారణంగా ఆలేరు నియోజకవర్గానికి చెడ్డపేరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనుండి సునీతపై ఇష్టానుసారంగా మాట్లాడితే చూస్తూ ఊర్కోమని, మరోసారి రిపీట్ అయితే పర్యవసానాలు సీరియస్ గా ఉంటాయని హెచ్చరించారు.

**ఆరోపణలు అవాస్తవమని ఎమ్మెల్యే నిరూపించుకోవాలి**

తనపై వస్తున్న అవినీతి ఆరోపణలు అవాస్తవమని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నిరూపించుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. దమ్ముంటే కొలనుపాక ల్యాండ్ ఇష్యూలో తనకు ఎలాంటి ప్రమేయం లేదని ఎమ్మెల్యే అయిలయ్య నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కొలనుపాక భూవివాదంలో మార్వాడీని బెదిరించి 10 ఎకరాల భూమిని తన అనుచరులపై ఎమ్మెల్యే రిజిస్ట్రేషన్ చేసుకుంది నిజం కాదా.?. ఇదే విషయంలో రూల్స్ బ్రేక్ చేసి రెండు రోజుల వ్యవధిలో 154 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసిన యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ గోపీ నాయక్ సస్పెండ్ అయింది నిజం కాదా.? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అక్రమంగా భూమి లాక్కున్నారనడానికి సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షనే మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు. కొలనుపాక ల్యాండ్ ఇష్యూలో తన ఇన్వాల్మెంట్ లేదని తన ఇష్టదైవమైన వీరభద్రస్వామిపై ప్రమాణానికి ఎమ్మెల్యే బీర్ల సిద్ధమా.? అని ప్రశ్నించారు. నిజంగా నిజాయితీపరుడివైతే ఏ అవినీతికి పాల్పడలేదని వీరభద్రస్వామి గుడిలో తడిబట్టలతో ప్రమాణం చేయాలని ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. ఇన్ని ఆధారాలు ఉన్నాయి కాబట్టే ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య భూదందాలకు తెరలేపారని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మీడియాతో మాట్లాడారని తెలిపారు. ఆరోపణలు వస్తే నిజాయితీపరుడినని నిరూపించుకోవాలే తప్ప.. ఆరోపణలు చేసినవారిపై నోరు పారేసుకోవద్దని హితవు పలికారు. నిజంగా ఎమ్మెల్యే నిజాయితీపరుడైతే తన ఇష్టదైవమైన వీరభద్రస్వామిపై ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో ఎమ్మెల్యే అయిలయ్య విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ వందల కోట్లు వెనకేసుకున్నారని ఆరోపించారు. ఆరోపణలు ఆధారాలతో సహా నిరూపించడానికి బహిరంగ చర్చకు తాము సిద్ధమన్న ఆయన.. బహిరంగ చర్చకు ప్లేస్, డేట్ మీరే ఫిక్స్ చేయండని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్లెం స్వాతి, గుట్ట కౌన్సిలర్లు బూడిద సురేందర్, ఆవుల మమత సాయి, నాయకులు కవిడే మహేందర్, రేపాక స్వామి తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన ప్రముఖ న్యాయవాది నాగారం అంజయ్య



భువనగిరి, రోమింగ్ న్యూస్: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ను మర్యాదపూర్వకంగా కలిసి నగరం అంజయ్య. రాష్ట్ర ప్రభుత్వ వైద్యశాలలో పేద ప్రజలకు అందవలసిన వైద్యానికి అవసరమయ్యే ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇస్తూ అలాగే న్యాయవాదులకు సంబంధించిన అంశాల మీద దీర్ఘంగా చర్చలు జరిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయకర్, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి లావుడే సిద్దు నాయక్, మాదిగ న్యాయవాదుల జాతీయ అధ్యక్షులు వీరాదాసు వెంకటరత్నం పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే దాడులు చేస్తారా ?

**ప్రజా పాలన అంటే ప్రశ్నించే వారిపై దాడులు చేయడమా ?**

**తెలంగాణ సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్**



భువనగిరి, రోమింగ్ న్యూస్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు పైళ్ళ శేఖర్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి విలేకరుల సమావేశంలో ప్రశ్నిస్తే వాటికి సమాధానం చెప్పలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు వారిపై భౌతిక దాడి చేయడానికి ప్రయత్నించి, పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేయడం చాలా సిగ్గుచేటని దీని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ అన్నారు. ప్రజా పాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగే వారిపై దాడులు చేస్తారా ? ప్రజాస్వామ్యమంటే ఇదేనా అని ప్రశ్నించారు ? బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడి జరుగుతుంటే అక్కడ ఉన్న పోలీసులు ప్రేక్ష పాత్ర వహిస్తున్నారని దీనిని బట్టి చూస్తే ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే ఈ దాడి జరిగిందని అర్థమవుతుందని అన్నారు. ఈ దాడి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులను తక్షణమే అరెస్టు చేయాలని సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

## యాదగిరిగుట్ట బీజేపీ నూతన కమిటీ ఎన్నిక

**యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన కర్రె ప్రవీణ్**

**యాదగిరిగుట్ట మండల అధ్యక్షురాలిగా గుంటుపల్లి మహేశ్వరి**






యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: భారతీయ జనతా పార్టీ యాదగిరిగుట్ట పట్టణ, మండల నూతన కమిటీలను శనివారం ఎన్నుకున్నారు. యాదగిరిగుట్ట పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా యాదగిరిగుట్టకు చెందిన కర్రె ప్రవీణ్ వరుసగా రెండోసారి ఎన్నిక కాగా.. మండల అధ్యక్షురాలిగా గౌరాయపల్లికి చెందిన గుంటుపల్లి మహేశ్వరి ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన మీటింగ్ లో పట్టణ, మండల కమిటీలపై బూత్ అధ్యక్షులు, క్రియాశీల సభ్యుల అభిప్రాయాలు తీసుకున్న జిల్లా కమిటీ సభ్యులు.. పార్టీ అధిష్టానానికి పంపించారు. అభిప్రాయాలను క్షుణ్ణంగా పరిశీలించిన రాష్ట్ర కమిటీ సభ్యులు.. పట్టణ అధ్యక్షుడుగా కర్రె ప్రవీణ్, మండల అధ్యక్షురాలుగా గుంటుపల్లి మహేశ్వరిని ఫైనల్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జిల్లా కౌన్సిల్ మెంబర్లుగా ఆకుల చంద్రమౌళి, మహేష్ ఎన్నికయ్యారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని నూతన అధ్యక్షులు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షుడిగా మరోసారి అవకాశం ఇచ్చిన పార్టీ పెద్దలకు కర్రె ప్రవీణ్ ధన్యవాదాలు తెలిపారు.

# కృష్ణుడి సేవలో తరించిన గోదాదేవి

**విగ్రహరూపంలో స్వామిని పరిణయామాడిన మహాసాధ్వి,, సంక్రాంతి ముందు ఏటా గోదా కళ్యాణం ప్రత్యేకం**



శ్రీరంగం,జనవరి11 : మిగిలిన దేవతా కళ్యాణోత్సవాలతో పోలిస్తే గోదా రంగనాథుల కళ్యాణం ప్రత్యేకతకు రెండు కారణాలు ఉన్నాయి. గోదాదేవి అద్భుతమైన వ్రతాన్ని ఆచరించి, ఆ ఆచరించిన దాన్ని మన దాకా ఆచరించేట్టుగా చేసింది అందుకే 'పాడియరుళవల్ల పల్-వళై యాయ్' అని అంటుంటాం కదా. తాను ఆచరించిన దాన్ని ఎంతో కాలం దాక ఆచరించగలిగేట్టుగా ప్రబంధాన్ని అందించింది. అది గోదాదేవి గొప్పతనం. ఇది వరకు ఇలాంటి వ్రతాన్ని గోపికలు చేసారు కానీ వారు తరువాతి వారికి ఏమి అందించలేదు శ్రీకృష్ణుని అనుభవాన్ని పొంది ఊరుకున్నారు. గోదాదేవి ఒక్కో పాటలో మనం ఏం తెలుసుకోవాలి, ఎలా తెలుసుకోవాలి, ఎలా ఆచరించాలో చెప్పింది. సీతమ్మ కానీ పద్మావతి అమ్మవారు కానీ భగవంతుణ్ణి తనవంటి కదిలే రూపంలోనే వివాహ మాడారు వారి అవతారాల్లో. కానీ గోదా దేవి మానవకన్యగా ఉంటూ

విగ్రహ స్వరూపుడైన రంగనాథున్ని వివాహమాడింది. తన ఆచరణతో విగ్రహ స్వరూపుడైన భగవంతుణ్ణి కదిలేట్టు చేసుకుంది. ఇదే అమ్మవారి యొక్క గొప్పతనం. మన ఎదురుగుండా కనిపించే విగ్రహాన్ని, అది దైవమని విశ్వసించి, మనం చెప్పినట్లుగా మనం పిలిచినట్లుగా అది కదల గలుగుతుంది, పలకగలుగుతుంది అనే విశ్వాసాన్ని ఆండాళ్ తల్లి నిరూపించి చూపించింది. 'ఉలగనిల్ తోత్రమాయ్ నింద్ర శుదరే తుయిలెరాయ్', అంది అమ్మ అంటే లోకంలో కంటికి కనిపించేట్టుగా విగ్రహరూపంలో ఉండే భగవంతుడా! ఆ విగ్రహ రూపంలో నీ ప్రభావము అనుపమానము, అసమానము అని విశ్వసిస్తున్నాను అని చెప్పి భగవంతుణ్ణి కదిలేట్టు చేసింది. అంతే కాదు స్వామి విగ్రహరూపంలో ఉన్నా ఆయన్ని నిర్బంధించి, బంధించి, ఆయన్ని పొందింది. అందుకే ఎక్కడో శ్రీవిల్లిపుత్తూరులో ఆంఢాళ్ ఉంటే, శ్రీరంగంలో ఉన్న స్వామి స్పందించి అర్చకులని, రాజుని అమ్మని తీసుకురమ్మని ప్రేరేపించి రప్పించుకున్నాడు. విగ్రహంలో ఉన్న స్వామితో వివాహమని తెలియగానే జనాలు తండోపతండాలుగా తరలి వచ్చి ఆశ్చర్యపోయినందుకే ఆ వీధికి చిత్రవీధి అనే పేరు ఏర్పడిపోయింది. తరువాత వీది ఉత్తరవీది, అక్కడ ఉన్న స్వామి అమ్మని వివాహమాడి గోదాదేవిని తనలో చేర్చుకున్నాడు. మానవకన్యగా ఉన్న ఆండాళ్ తల్లిని ఉత్సవ మూర్తిగా మలచి తానూ ఉత్సవ మూర్తిగా కలిసి ఉన్నాడు. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరులో విష్ణుచిత్తుడనే భక్తుడు ఉండేవాడు. ఈ విల్లిపుత్తూరులోనే శ్రీకృష్ణుడు, మర్రి ఆకు మీద తేలియాడుతూ లోకాన్ని రక్షించాడని నమ్మకం. అందుకే ఇక్కడి ఆలయంలోని ప్రధాన దైవం ఆ చిన్నికృష్ణుడే. విష్ణుచిత్తుడు నిత్యం ఆ కృష్ణునికి పుష్పమాలలని అర్పిస్తూ ఉండేవాడు. ఆయనను విష్ణుభక్తులైన ఆళ్వారులలో ఒకరిగా ఎంచి, ఆయనకు పెరియాళ్వారు అంటే - పెద్ద ఆళ్వారు అన్న గౌరవాన్ని కూడా అందించారు. అలాంటి పెరియాళ్వారు ఒకసారి తులసి మొక్కల కోసం పాదులు తీస్తుండగా ఒక పాప కనిపించింది. ఆమెను సాక్షాత్తూ భగవంతుని ప్రసాదంగా భావించి ఆమెను పెంచుకోసాగాడు విష్ణుచిత్తుడు. ఆమెకు 'కోదై' అంటే - పూలమాల అన్నపేరుతో గారాబంగా పెంచసాగాడు విష్ణుచిత్తుడు. ఆ పేరే క్రమంగా గోదాగా మారింది. గోదాదేవి చిన్ననాటి నుంచి కృష్ణుడి లీలలను ఆడుతూపాడుతూ పెరిగిందే. యుక్తవయసు వచ్చేసరికి ఆ భక్తి కాస్తా ప్రేమగా మారిపోయింది. కళ్లుమూసినా, తెరిచినా ఆ నల్లనివాడే కనిపించసాగాడు. తన చుట్టూ ఉన్న స్నేహితురాళ్లంతా ఒకప్పటి గోపికలనీ, తానుండే విల్లిపుత్తూరు ఒకనాటి గోకులమని భావించసాగింది. అంతేకాదు! తన తండ్రి విష్ణుచిత్తుడు రోజూ భగవంతుని కోసం రూపొందించే మాలలను ముందు తనే ధరించి, తనలో ఆ కృష్ణుని చూసుకుని మురిసిపోయేది. ఈ దృశ్యం ఒకరోజు విష్ణుచిత్తుని కంట పడనే పడింది.

తన కూతురు చేసిన పని వల్ల ఇన్నాళ్లూ ఆ దేవదేవుని పట్ల అపచారం జరిగిందని బాధపడ్డాడు. కానీ ఆ రోజు కృష్ణుడు అతనికి కలలో కనిపించి, గోదాదేవి సాక్షాత్తూ భూదేవి అవతారమేననీ, ఆమె వేసుకున్న మాలలను ధరించిడం వల్ల తనకు అపచారం కాదు కదా, ఆనందం కలుగుతుందనీ తెలియచేశాడు. ఇలాంటి సంఘటనలన్నీ గోదా మనసులో కృష్ణప్రేమని మరింతగా పెంచాయి. ఇలా సాగుతున్న గోదాదేవి ప్రేమకు, ఆ కృష్ణుడు లొంగక తప్పలేదు. దాంతో ఆయన విష్ణుచిత్తునికి కనిపించి, గోదాదేవిని శ్రీరంగానికి తీసుకురమ్మనీ? అక్కడ రంగనాథునిగా వెలసిన తాను గోదాదేవిని వివాహం చేసుకుంటాననీ చెప్పాడు. శ్రీరంగంలోని ఆలయ అర్చకులకు కూడా ఈ విషయాన్ని తెలియచేశాడు. కృష్ణుని ఆదేశాలను విన్న విష్ణుచిత్తుని సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. వెంటనే గోదాదేవినీ, విల్లిపుత్తూరులోని ప్రజలనూ తీసుకుని శ్రీరంగానికి బయల్దేరాడు. అక్కడ వారి రాక గురించి ముందే తెలిసిన అర్చకులు వారిని ఆలయంలోకి తీసుకువెళ్లారు. పెళ్లికూతురిగా గర్భగుడిలోకి ప్రవేశించిన గోదాదేవి,

అందరూ చూస్తుండగా ఆ రంగనాథునిలో ఐక్యమైపోయింది. ఇదంతా మకర సంక్రాంతికి ముందు భోగిరోజు జరిగింది. అందుకే ప్రతి వైష్ణవాలయంలో భోగినాడు గోదాదేవికి, విష్ణుమూర్తితో కళ్యాణం జరుపుతారు.


ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం
12 జనవరి
2025





# ఆందోళనకరంగా భారత్ ఆర్థిక వ్యవస్థ

## అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఎండి జార్జివా వ్యాఖ్య



**న్యూఢిల్లీ, జనవరి 11:** 2025లో భారత ఆర్థిక వ్యవస్థ గురించి అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాదిలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉన్నప్పటికీ, భారత్ విషయానికి వస్తే 'కొంచెం బలహీనంగా' ఉంటుందని అంచనా వేశారు. ఈ సంవత్సరం ప్రపంచం చాలా అనిశ్చితిని చూస్తుందని, ప్రధానంగా అమెరికా వాణిజ్య విధానంపై అనిశ్చితి ఉన్నట్లు జార్జివా చెప్పారు. 2025 సంవత్సరంలో ప్రపంచ వృద్ధి స్థిరంగా ఉండే అవకాశం ఉందని, ప్రాంతీయ వైవిధ్యాలు అందులో కనిపిస్తాయని ఆమె వార్షిక మీడియా రౌండ్ టేబుల్ సమావేశంలో అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ 2025 లో కొద్దిగా బలహీనపడవచ్చని జార్జివా ఆందోళన వ్యక్తం చేశారు. అయితే దీని గురించి ఇంకేమీ చెప్పలేదు. దీనిపై మరిన్ని వివరాలు ప్రపంచ ఆర్థిక పరిస్థితిపై రాబోయే నివేదికలో ఇవ్వబడతాయని అన్నారు. అమెరికా మనం ఊహించిన దానికంటే చాలా మెరుగ్గా పనిచేస్తోందన్నారు. ఈ క్రమంలో యూరోపియన్ యూనియన్ కొంచెం నిలబడిందని, భారతదేశం కొంచెం బలహీనంగా ఉందని ఆమె అన్నారు. దీంతో పాటు బ్రెజిల్ కొంతవరకు అధిక ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొంటోందని ఆమె గుర్తు చేశారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనా ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, దేశీయ డిమాండ్‌కు కొనసాగుతున్న సవాళ్ల నుంచి ఒత్తిడిని ఎదుర్కొంటోందని జార్జివా అన్నారు. వారి అన్ని ప్రయత్నాలు ఉన్నప్పటికీ, తక్కువ ఆదాయ దేశాలు గణనీయమైన ప్రతికూల ప్రభావాన్ని చూపే పరిస్థితిలో ఉన్నాయని జార్జివా అన్నారు. ఈ క్రమంలో 2025లో ఆర్థిక విధానాలకు సంబంధించి చాలా అనిశ్చితి ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ పరిమాణం, పాత్రను దృష్టిలో ఉంచుకుని, రాబోయే పరిపాలన విధాన చర్యలు, ముఖ్యంగా సుంకాలు, పన్నులు, నియంత్రణ వంటివి ఉంటాయన్నారు. చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలపై అదనపు సుంకాలను విధించే ప్రణాళికలను డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. జనవరి 20న ఆయన అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సుంకాలను కీలక విధాన సాధనంగా ఉపయోగించాలనే తన ఉద్దేశాన్ని ఆయన బహిరంగంగా ప్రకటించారు. ఈ అనిశ్చితి వాణిజ్య విధానం ముందుకు సాగడానికి సంబంధించినదని జార్జివా చెప్పారు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను మరింత పెంచుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రపంచ సరఫరా వ్యవస్థపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థలు అనిశ్చితికి గురవుతాయని ఎఓఈ మేనేజింగ్ డైరెక్టర్ అన్నారు.

## సంక్రాంతి పండుగ దష్ట్యా ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, జనవరి 11 :** సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే అదనపు రైళ్లను నడిపించేందుకు చర్యలు చేపట్టింది. 26 అదనపు రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ నెల 17వ తేదీ వరకు ఈ అదనపు రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి. చర్లపల్లి నుంచి విశాఖకు, సికింద్రాబాద్ బెంగళూరు మధ్య అదనపు రైళ్లను నడపనున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి – విశాఖ మధ్య జనసాధారణ్ అన్ రిజర్వ్‌డ్ రైళ్లను నడుపుతోంది. చర్లపల్లి నుంచి విశాఖకు ఈనెల 11, 13, 16, 18, 20, 25 తేదీల్లో రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి. చర్లపల్లిలో ఉదయం 10 గంటలకు బయల్దేరి విశాఖకు రాత్రి 10 గంటలకు చేరుకోనున్నాయి. విశాఖ నుంచి చర్లపల్లికి ఈ నెల 10, 12, 15, 17, 20, 25 తేదీల్లో రైళ్లు నడవనున్నాయి. విశాఖ నుంచి సాయంత్రం 6.20కి బయల్దేరి ఉదయం 8 గంటలకు చర్లపల్లికి చేరుకోనున్నాయి.

## సీఎం సంక్రాంతి శుభాకాంక్షలు

**హైదరాబాద్, జనవరి 11:** ప్రతి ఒక్కరూ ఊరెల్లి నలుగురితో కలవాలి.. ఇక, రాబోయే 50 ఏళ్ల కాలానికి గాను అవసరాలను అంచనా వేసి కొత్త ఆసుపత్రిని నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆసుపత్రికి నలువైపులా రహదారులు ఉండేలని చూడాలన్నారు. చికిత్స కోసం అన్ని జిల్లాల నుంచి ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కనెక్టివిటీ రోడ్లను డెవలప్ చేయాలని సూచించారు. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాలను రూపొందించాలన్నారు. ఈ నెలాఖరులోగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

## తిరుమల అటవీలో చిరుత సంచారం

### చిరుతను చూసి భయంతో కిందపడ్డ ఉద్యోగి

**తిరుమల,జనవరి11 :** తిరుమలలో చిరుత సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. అలిపిరి వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న టీటీడీ ఉద్యోగికి చిరుత కనిపించింది. చిరుతను చూడగానే అతను తీవ్ర భయాందోళనకు గురయ్యాడు. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో బాధితుడికి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న టీటీడీ అధికారులు అప్రమత్తమయ్యారు. చిరుత సంచారంపై భక్తులను అప్రమత్తం చేశారు. అలిపిరి సమీపంలో చిరుత సంచరిస్తున్నట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. భక్తులందరూ అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిస్తున్నారు. మరోవైపు చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులకు టీటీడీ సిబ్బంది సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఫారెస్ట్ అధికారులు.. చిరుత కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దాన్ని పట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ట్రాప్ కెమెరాలు అమర్చడం సహా బోన్ ఏర్పాటు చేయడం వంటి అంశాలపై చర్చిస్తున్నారు.

## తిరుపతి తొక్కిసలాట బాధితులకు పరిహారం

### రెండు బృందాలను నియిమించిన టిటిడి

**తిరుపతి,జనవరి 11:** తిరుపతి తొక్కిసలాట ఘటనలో బాధితులకు పరిహారం పంపిణీ కోసం తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు.. బోర్డు సభ్యులతో రెండు బృందాలను నియమించారు. మృతుల కుటుంబాలు, గాయపడిన వారికి ఆదివారం నుంచి ఈ బృందాలు పరిహారం చెక్కులు అందజేయనున్నాయి. విశాఖ, నర్సీపట్నం వెళ్లే బృందంలో బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, జంగా కృష్ణమూర్తి, పనబాక లక్ష్మి, జానకీదేవి, మహేందర్‌రెడ్డి, ఎం.ఎస్ రాజు, భానుప్రకాశ్‌రెడ్డి ఉన్నారు. తమిళనాడు, కేరళ వెళ్లే బృందంలో శ్రీరామమూర్తి, కృష్ణమూర్తి వైద్యనాథన్, నరేష్ కుమార్, శాంతారాం, సుచిత్ర ఎల్ల ఉన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున, కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇవ్వనున్నారు. మృతుల కుటుంబాల్లో పిల్లలకు విద్య అందించేందుకు వివరాలు సేకరించనున్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరికి రూ.5 లక్షలు చొప్పున, గాయపడిన 31 మందికి రూ.2లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నారు.

# కబ్జాకోరులపై ఉక్కుపాదం మోపండి

- మీవెంట మేం ఉంటాం
- ఇప్పుడైనా ప్రజల కోసం కలిసి పనిచేద్దాం... అభివృద్ధి సాధిద్దాం
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- సిరిసిల్ల కలెక్టరేట్ లో దివ్యాంగులకు కేంద్ర మంత్రి చేతుల మీదుగా ఉపకరణాల పంపిణీ




**రాజన్న సిరిసిల్ల, జనవరి 11:** "రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా కలెక్టర్ ను మళ్లీ కోరుతున్నా... పేదల భూములను కబ్జాలు చేసినోళ్లను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించనోళ్లపై ఉక్కు పాదం మోపండి. మీ వెంట నాతో సహా వేల మంది అండ గా ఉంటారు. ఈ విషయంలో మీరు ముందుకు పోవాలని కోరుతున్నా" అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర యంత్రాంగాన్ని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ భవనాలు నిర్మించాలంటే, మంచి పనులు చేయాలంటే ప్రభుత్వ స్థలాలు లేకుండా పోయాయని, గత బీఆర్ఎస్ పాలకులు, కేసీఆర్ కుటుంబం ధరణి పేరుతో ప్రభుత్వ భూములన్నీ ప్రైవేట్ చేశారని మండిపడ్డారు. అట్లాంటి వారిని ఉపేక్షించొద్దని, బుల్డోజర్లు దించాలని కోరారు. శనివారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన దివ్యాంగులకు ఉప కరణాల పంపిణీ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బండి సంజయ్ తోపాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నాగుల సత్యనారాయణ, స్థానిక మున్సిపల్ ఛైర్మన్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. 'రాబోయే రోజుల్లో రాజకీయాలకు అతీతంగా కలిసి ముందుకు పోవాలని భావిస్తున్నా. దారి తప్పుతున్నోళ్లను దారికి తెచ్చేందుకు యత్నిస్తా. నేను 5 ఏళ్లలో ఎన్నడూ కలెక్టరేట్ కు రాలేదు. ఏ కార్యక్రమంలో పాల్గొనలేదు. ఎందుకంటే గతంలో నన్ను ఏ కార్యక్రమానికి పిలవలేదు. కలెక్టరేట్ కు వెళితే.. వెంటనే బాధ్యులను బదిలీ చేసే వాళ్లు... అందుకే గతంలో ఒక ఎమ్మెల్యే కలిసి ప్రోగ్రాం పెడతామంటే.. మ్యూజిక్ ప్రోగాం పెడదామా? అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఇప్పుడు ఆ పార్టీ నేతలు కలెక్టర్ ను దూషిస్తున్నారని, అధికారులను పట్టుకుని తిడుతున్నారని, అటెండర్ నుండి కలెక్టర్ కావాలంటే కష్టపడి చదివి రావాలన్నారు. 'కలెక్టర్ గారు... ఎమ్మెల్యేలారా.. బీఆర్ఎస్ ప్రభుత్వం కబ్జా చేసిన స్థలాలు, భవనాలన్నీ స్వాధీన పర్చుకోండి. గతంలో ఎకరాలకు ఎకరాలు కబ్జాలు చేసి దోచుకుంటామంటూ చూస్తూ ఊరుకోవడానికి సిద్ధంగా లేం'.. అని అన్నారు. ధరణి పేరుతో భూములన్నీ దోచుకున్నారని, ఒక కుటుంబమే ఎక్కువగా లాభపడ్డదరిచ ప్రభుత్వ భూములన్నీ ప్రైవేట్ పరం చేశారని, ఇకపై అట్లా జరగడానికి వీల్లేదని చెప్పారు. సిరిసిల్ల జిల్లాలో నవోదయ స్కూల్ త్వరలో మంజూరు కాబోతోందన్నారు. అతి త్వరలోనే వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీంలో చేర్చుతామన్నారు.

# నల్లగొండ ఇంటెలిజెన్స్ ఎస్పీ కవితపై వేటు

## డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ

**నల్లగొండ, జనవరి 11:** అక్రమ వసూళ్లు, కిందిస్థాయి సిబ్బంది వద్ద చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలపై నల్లగొండ జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీ కవితపై వేటు పడింది. గంజి కవితను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కవిత స్థానంలో శ్రీనివాస్ రావుకు పోస్టింగ్ ఇచ్చారు. సమగ్ర విచారణ అనంతరం కవితపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అక్రమాలు, వసూళ్లకు పాల్పడుతున్నారని కవితపై ఆరోపణలు ఉన్నాయి. సొంత సిబ్బంది నుండి సైతం భారీగా వసూళ్లు చేసినట్టు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. గత 15 రోజులుగా కవిత అక్రమాలపై రాష్ట్ర నిఘా విభాగం దృష్టి పెట్టింది. రేషన్, గుట్కా మాఫీయా నుంచి అక్రమ వసూళ్లు, కింది స్థాయి సిబ్బంది వద్ద కూడా చేతివాటం ప్రదర్శించినట్టు నిర్ధారణ అయినట్లు సమాచారం. కవిత అక్రమాల్లో ఒక ఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుల్స్, ఒక హెడ్ కానిస్టేబుల్ పాలుపంచుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కవిత షాడో టీమ్ పైనా విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. పోలీసు ఉన్నతాధికారుల విచారణలో విస్తుపోయే నిజాలు వెల్లడవుతున్నట్లు సమాచారం. నల్లగొండ జిల్లాకు 2017 సంవత్సరంలో డీఎస్పీ కేడర్ అధికారిగా పోస్టింగ్‌పై వచ్చిన గంజి కవిత ఏడేండ్లుగా ఇక్కడే విధులు నిర్వర్తిస్తూ పదోన్నతులు పొంది బదిలీపై వెళ్లకుండా తన పలుకుబడిని ఉపయోగించి తిష్ఠ వేశారు. ఈ క్రమంలో అనేక అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు ఇతర పోలీస్ అధికారులు అవినీతికి పాల్పడుతున్నట్లు మూడు నెలలకు ఒక అధికారిపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు రిపోర్ట్‌లు ఇస్తూ తాను నిజాయితీ గల అధికారిగా వారిని నమ్మించి మన్ననలు పొందుతున్నారని లేఖలో పేర్కొన్నారు. నల్లగొండ, సూర్యాపేట రెండు జిల్లాలకు ఉన్నతాధికారిగా ఉంటూ ప్రభుత్వం నుంచి పోలీస్ సిబ్బందికి వచ్చే అలవెన్స్‌లు, ఇతర గ్రాంట్లను వారికి ఇవ్వకుండా కాజేస్తున్నట్లు ఆరోపించారు. ఇంటెలిజెన్స్ శాఖ నుంచి జిల్లాకు ప్రతి నెలా రూ. 35 వేలు ఎస్ఆర్ రూపంలో రెండు జిల్లాలకు కలిసి రూ.70 వేలు కేటాయిస్తుండగా, గత ఐదు సంవత్సరాల నుంచి సిబ్బందికి ఇవ్వకుండా ఆ అధికారే తీసుకుంటున్నట్లు సమాచారం. నాలుగు సంవత్సరాల క్రితం సదరు ఆఫీసర్‌కు బిడ్డ పుట్టడంతో పుట్టిన రోజు సందర్భంగా ఏటా నాలుగు తులాల చొప్పున ఇప్పటివరకు పదహారు తులాల బంగారం రెండు జిల్లాల సిబ్బంది నుంచి వసూలు చేసినట్లు లేఖలో ఆరోపించారు.

## నాంపల్లి కోర్టులో అల్లుఅర్జున్‌కు ఊరట




**హైదరాబాద్, జనవరి 11:** సినీ నటుడు అల్లు అర్జున్‌కి నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. రెగ్యులర్ బెయిల్‌కి అప్లయ్ చేసిన అల్లు అర్జున్‌కి నాంపల్లి కోర్టు ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీసుల ఎదుట హాజరుకావాలని ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ నిబంధనను కోర్టు మినహాయించింది. అలాగే విదేశాలకు వెళ్లేందుకు కూడా అల్లు అర్జున్‌కి కోర్టు అనుమతినిచ్చింది. పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడంతో పాటు ఆమె కుమారుడు శ్రీతేజ్ గాయలతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై అల్లు అర్జున్‌ని చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టు ముందు హాజరుపర్చగా.. అతడికి 14 రోజు జ్యూడిషియల్ రిమాండ్ విధించింది కోర్టు. దీంతో అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించగా.. తెలంగాణ హైకోర్ట్ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. దీంతో బెయిల్ మీద బయటికి వచ్చాడు బన్నీ. అయితే రీసెంట్‌గా బెయిల్ గడువు కూడా ముగియడంతో రెగ్యులర్ బెయిల్ కోసం అప్లయ్ చేసుకోగా.. నాంపల్లి కోర్టు బన్నీకి పలు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.

# సమాచారాన్ని తొక్కిపెట్టాలనుకోవడం దారుణం

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, జనవరి 11:** సుంకిశాల ఘటనపై విజిలెన్స్ నివేదికను సమాచార హక్కు చట్టం కింద ఇవ్వకుండా తొక్కిపెట్టడం దారుణం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఒక నిర్మాణ సంస్థ చేసిన ఘోర తప్పిదాన్ని.. దేశ రక్షణకు సంబంధించిన సమాచార హక్కు సెక్షన్లతో ముడిపెట్టి దాచడం మరింత విడ్డూరమని కేటీఆర్ ధ్వజమెత్తారు. మేఘా సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలనే కమిటీ రిపోర్ట్‌ను ప్రభుత్వం రహస్యంగా ఉంచడానికి ప్రధాన కారణం సీఎం రేవంత్ మేఘా కృష్ణారెడ్డికి మధ్య కుదిరిన చీకటి ఒప్పందమే అని కేటీఆర్ పేర్కొన్నారు. సుంకిశాలలో మేఘా సంస్థ నిర్లక్ష్యం వల్ల రిటైనింగ్‌వాల్ కూలి రూ. 80 కోట్ల ప్రజాధనానికి నష్టం వాటిల్లింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న తాగునీటి అవసరాలు తీర్చే సంకల్పానికి గండిపడింది. నిర్మాణ లోపం బయట పడుతుందనే భయంతోనే కమిటీ నివేదికను బహిర్గతం చేయడానికి కాంగ్రెస్ సర్కారు జంకుతోంది. సమాచారాన్ని దాచడం అంటే జరిగిన తప్పును ఒప్పుకున్నట్టే కదా అని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేఘా సంస్థను ఈస్ట్ ఇండియా కంపెనీ అని దుమ్మెత్తిపోసిన రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించారు. తన జేబు సంస్థగా మార్చుకుని ఢిల్లీ పెద్దల ధనదాహాన్ని తీర్చేందుకు పావుగా వాడుకుంటున్నారు. బ్లాక్‌లిస్టులో పెట్టాల్సిన మేఘా సంస్థకు, మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కంపెనీకి రూ.4,350 కోట్ల కొండగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును (%ుబఱఅ జూతీశీఎబశీ%) కేక్ కోసినట్టు చెరిసగం పంచిపెట్టి భారీ కుంభకోణానికి తెరతీశారు. ఇప్పటికైనా సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలను మానుకోవాలని, సుంకిశాల ఘటనపై ప్రభుత్వం చేపట్టిన విచారణ నివేదికను బహిర్గతం చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం
12 జనవరి
2025





# అయోధ్యలో బాల రాముడికి అభిషేకం

**న్యూఢిల్లీ, జనవరి 11:** అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామ మందిరంలో రామ్‌లల్లాను ప్రతిష్టాపన చేసి ఏడాది కావొస్తోంది. ఈ సందర్భంగా అయోధ్యలో ప్రత్యేక వేడుకలను నిర్వహిస్తున్నారు. ప్రధాన వేడుకలు నేటి నుంచి ప్రారంభమయ్యాయి. మొదట బాలరాముడికి మహాభిషేకం నిర్వహించారు. పంచామృతం, సరయూ నది నుంచి తెచ్చిన పవిత్ర జలంతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు ఉదయం నుంచే ఆలయంలో క్యూ కట్టారు. కాగా, నేటి నుంచి జనవరి 13 వరకూ ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు జరగనున్నాయి. బాలరాముడికి అభిషేకం చేస్తున్న వీడియో వైరల్ అవుతోంది. మరోవైపు తొలి వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు గ్రీటింగ్స్ తెలిపారు. ఎక్స్ అకౌంట్‌లో ఆయన పోస్టు చేస్తూ.. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతకు గొప్ప వారసత్వంగా ఈ ఆలయం నిలుస్తుందని ఆయన అన్నారు. ఎన్నో శతాబ్ధాల త్యాగాలు, పోరాటాల ద్వారా ఆలయాన్ని నిర్మించినట్లు చెప్పారు. నూతన భారత్‌ను నిర్మించే అంశంలో ఈ దివ్య, భవ్య అయోధ్య రామాలయం దేశ ప్రజలకు ప్రేరణగా నిలుస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు.

# అయోధ్య రామ మందిర తొలి వార్షికోత్సవం

### ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ,జనవరి 11:** అయోధ్యలో కొత్త నిర్మించిన రామ మందిరంలో రామ్‌లల్లాను ప్రతిష్టాపన చేసి ఏడాది కావొస్తోంది. ఈ నేపథ్యంలో తొలి వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు గ్రీటింగ్స్ తెలిపారు. ఎక్స్ అకౌంట్‌లో ఆయన పోస్టు చేస్తూ.. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతకు గొప్ప వారసత్వంగా ఈ ఆలయం నిలుస్తుందని ఆయన అన్నారు. ఎన్నో శతాబ్ధాల త్యాగాలు, పోరాటాల ద్వారా ఆలయాన్ని నిర్మించినట్లు చెప్పారు. నూతన భారత్‌ను నిర్మించే అంశంలో ఈ దివ్య, భవ్య అయోధ్య రామాలయం దేశ ప్రజలకు ప్రేరణగా నిలుస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు.

# మైనర్‌పై 60 మందికి పైగా లైంగిక వేధింపులు

**తిరువనంతపురం, జనవరి 11:** కేరళ రాష్ట్రంలో దారుణం జరిగింది. మైనర్ అయిన ఓ క్రీడాకారిణిపై ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 60 మంది లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. గడిచిన ఐదేళ్లల్లో తనపై 60 మందికి పైగా లైంగిక వేధింపులకు పాల్పడ్డారని 18 ఏళ్ల ఆ క్రీడాకారిణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాను మైనర్‌గా ఉన్నప్పుడే ఇదంతా జరిగిందని తన ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు సంబంధించి మహిళ సమాఖ్య నిర్వహించిన కౌన్సిలింగ్ సెషన్‌లో క్రీడాకారిణి తనకు జరిగిన దారుణాల గురించి వివరించింది. 13 ఏళ్ల ప్రాయంలోనే తనపై అత్యాచారం జరిగిందని యువతి తన ఫిర్యాదులో పేర్కొంది. తన పొరుగింట్లో ఉన్న ఓ వ్యక్తి తనను కొండల ప్రాంతానికి తీసుకెళ్లి ముగ్గురు స్నేహితులతో కలిసి అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపింది. ఆ తర్వాత కోచ్‌లు, క్లాస్?మేట్స్, అథ్లెట్స్?ఎక్కువగా లైంగికంగా వేధించారని వెల్లడించింది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా పోలీసులు 62 మందిని అనుమానితులుగా గుర్తించారు. వారిలో 40 మందిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. వారిలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బాధితురాలిని కౌన్సిలింగ్‌కు పంపించినట్లు పథనంథిట్ట ఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఒక ప్రత్యేక బృందాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

# 8 నెలలుగా ఫ్రిడ్జ్‌లోనే మహిళ మృతదేహం



**భోపాల్, జనవరి 11:** మధ్యప్రదేశ్‌లోని దివాస్‌లో సహజీవనం చేస్తున్న మహిళను చంపేశాడు ఓ వ్యక్తి. అయితే ఆమెకు చెందిన మృతదేహాన్ని ఓ ఫ్రిడ్జ్‌లో గుర్తించారు. సుమారు 8 నెలల నుంచి రిఫ్రిజిరేటర్‌లోనే ఆమె శవం ఉన్నట్లు పోలీసులు చెప్పారు. శుక్రవారం ఓ ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్ నుంచి ఆ మహిళ శవాన్ని వెలికి తీశారు. చీరలో ఉన్న ఆమె చేతుల్ని కట్టేశారు. మెడలో బంగారు ఆభరణాలు ఉన్నాయి. నిందితుడు సంజయ్ పటిదార్ తన ఇంటిని కిరాయి ఇవ్వడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మృతురాలను పింకీ ప్రజాపతిగా గుర్తించారు. ఆమెను గత ఏడాది జూన్‌లో హత్య చేసి ఉంటారని అంచనా వేస్తున్నారు. నిందితుడు పటిదార్ .. ఉజ్జయిన్ నివాసి. గత అయిదేళ్లతో నుంచి బాధిత మహిళతో అతను లివిన్ రిలేషన్‌లో ఉన్నారు. పెళ్లి చేసుకోవాలని వత్తిడి చేయడం వల్లే.. పటిదార్ ఆ మహిళను చంపి ఉంటారని భావిస్తున్నారు. స్నేహితుడి హెల్ప్ తీసుకుని హత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. ఇంట్లో నుంచి చెడు వాసన రావడంతో.. ఓనర్‌ను పిలిపించారు. అయితే ఓ రూమ్‌ను తెరవగా దాంట్లో ఉన్న ఫ్రిడ్జ్‌లో మహిళ శవాన్ని గుర్తించారు. ఇంటి ఓనర్ ధీరేంద్ర శ్రీవాత్సవ్.. ఇండోర్‌లో ఉంటాడు.

# జాతిని జాగృతం చేసిన స్వామి వివేకానంద

**భారతదేశాన్ని జాగృతము చెయ్యడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండులలో యోగ, వేదాంత శాస్త్రములను తన ఉపన్యాసముల ద్వారా, వాదనల ద్వారా పరిచయం చేసిన ఖ్యాతి స్వామి వివేకానందది. ఆయన ఎప్పుడూ యువతను మేల్కొల్పుతూనే ఉంటారు. ముఖ్యంగా యువతకోసం ఆయన ఎంతో తపించారు. భారతదేశ భవిష్యత్తుని మార్చగలిగేది యువతేనని. యువత ఒక మంచి ఆశయంతో ముందుకు వెళ్లాలని ఆయన అనేవారు. అందుకే 'డబ్బు లేని వాడు కాదు జీవితంలో ఒక ఆశయం అంటూ లేని వాడు అసలైన పేదవాడు అంటారు'వివేకానంద.**



**ఆయన ఎప్పుడు కూడా 'గొర్రెలలా కాదు సింహంలా ధైరంగా బ్రతకమని' దేనికి భయపడవద్దని అంటారు. 'ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన కొంతమంది యువకులను నాకు అప్పగిస్తే ఈ దేశం స్వరూపాన్నే మార్చేస్తాను' అని స్వామిజీ తరచూ అనేవారు. మన దేశంలో యువత మనసులో స్ఫూర్తి నింపినవారిలో వివేకానంద అంతటి వారు మరొకరు లేరు. అందుకే మన దేశంలో ఆయన పుట్టినరోజు జనవరి 12 ను 'నేషనల్ యూత్ డే' గా జరుపుకుంటారు.**

ఆయన తన ప్రసంగాలతో, సూక్తులతో పుస్తకాలతో, యువతరాన్ని ఉత్తేజపరిచి, దిశానిర్ధేశం చేశారు. జీవితం నిరాశ నిస్పృహలతో నిండిపోయినప్పుడు, భయ బ్రాంతులకు గురైనపుడు, మనసు చెడు మార్గాలవైపు మళ్ళి ఏమిచెయ్యాలో దిక్కు తోచని పరిస్థితులలో ఉన్నపుడు ఒక్కసారి స్వామి వివేకానందకి సంబందించిన పుస్తకాలు, సూక్తులను చదవండి. వివేకానందుడి సందేశాలు సూటిగా మన హృదయాన్ని తాకుతాయి. మనసులో ఒక తెలియని ధైర్యం, ఆలోచనలో మార్పు కలుగు తుంది. జీవితానికి అసలైన అర్ధం తెలుస్తుంది. నిద్రాణమై ఉన్న భారత జాతిని మేల్కొలిపిన ఆ మహనీయుడు, యుగ పురుషుడు ఎప్పటికి మన గుండెల్లో నిలిచే ఉంటారు. అమెరికాకు వెళ్ళి అక్కడ హిందూ మత ప్రాశస్త్యం గురించి ఎన్నో ఉపన్యాసాలు చేయడం ద్వారా భారత కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానంద. యువత తమ తెలివితేటలతో ఆధునిక భారత నిర్మాణానికి పూనుకోవడం ద్వారానే ఆయనకు నివాళి అర్పించగలదు.. భారతదేశాన్ని ప్రేమించి, భారతదేశం మళ్ళీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద. అతని వాగ్దాటికి ముగ్ధులైన అమెరికా ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. ఎంతో మంది అతనికి శిష్యులయ్యారు.




**పాశ్చాత్య దేశాలలోకి అడుగు పెట్టిన మొద టి హిందూ సన్యాసి ఆయనే. తూ ర్పు దేశాల తత్త్వమును షికాగోలో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మే ళనంలో 1893లో ప్రవేశపెట్టా డు. అక్కడే షికాగోలోను, అమెరి కాలోని ఇతర ప్రాంతాలలోను ప్ర జల అభిమానాన్ని చూరగొన్నాడు. తిరిగి భారత దేశం వచ్చిన వివేకా నంద రామకృష్ణ మఠాన్ని స్థాపిం చి దీని ద్వారా భారత యువతకు దిశా నిర్దేశం చేశాడు. ఇంతటి ఘనత సాధించిన స్వామి వివేకా నంద కేవలం 39 ఏళ్ళ వయసులోనే మరణించాడు. అతను చేసిన సేవలకు గుర్తింపుగా 1984లో భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని 'జాతీయ యువజన దినోత్సవం'గా ప్రకటించింది.**


వివేకానందుడు తన సందేశంలో భారతదేశ మత సామరస్యాన్ని గురించి, వైవిధ్యాన్ని గురించి వివరించాడు. ప్రాచీన కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో దాడులు ఎదుర్కొన్న నుంచి ఇజ్రాయెలీలు, పార్సీలు వంటివారిని స్వీకరించి హృదయాలకు హత్తుకున్న భారతదేశానికి చెందినవాడినని గర్విస్తున్నానన్నాడు. వివిధ మార్గాల ద్వారా సాగిన మానవులంతా భగవంతుణ్ణి చేరుకుంటారని చెప్పే హిందూ సూక్తులను, భగవద్గీత శ్లోకాన్ని ప్రస్తావించాడు. చారిత్రకంగా ఎన్నో నాగరికతలు, దేశాలను నాశనం చేసిన మూఢభక్తి, మతతత్వాలను సర్వమత సమ్మేళనం దూరం చేస్తుందని విశ్వసిస్తున్నట్టు చెప్పాడు. తరవాత రామకృష్ణ పరమహంస సాహచర్యలో జీవితం గడిపాడు. రామకృష్ణ పరమహంస నుంచి నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నాడు. అలా చదువుకుంటూనే మెల్లగా సన్యాస మార్గంలోకి నడిచాడు. కుటుంబ కష్టాలను ఈడుస్తున్న సమయంలోనే 1886లో రామకృష్ణ పరమహంస మరణించారు. పాశాత్య దేశాలకు వెళ్లి భారతదేశపు గొప్పతన్నాని చాటాలని అలాగే తిరిగి వచ్చిన తరువాత నిరాశ నిస్పృహలతో నిండిపోయిన భారతీయులను మేల్కొలపాలని నిర్ణయించుకున్నారు. అయితే చికాగోలో జరగబోయే సర్వమత మహా సభలకు వెళ్లాలని, అక్కడ భారతదేశ గొప్పతన్నాని, ఆధ్యాత్మికను చాటి చెప్పాలనుకున్నారు. అలా షికాగో ద్వారా భారత ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటారు. 1893 సంవత్సరం సెప్టెంబర్ 11న ప్రారంభమయ్యాయి. ఇతర మతాలకు చెందిన గొప్ప గొప్ప వాళ్ళందరూ.. సూటు బూట్లతో రెడీ అయ్యి ఉంటారు. కానీ వివేకానంద దుస్తులు, వేషధారణ చూసి ఆయన్ని ఎవరూ కూడా గౌరవించలేదు. చులకనగా చూస్తారు. సభలో ఒక్కొక్కరుగా లేచి వాళ్ళ మతాల గొప్పతనం గురించి మాట్లాడుతుంటారు. చివరగా స్వామి వివేకానంద వంతు రానే వచ్చింది. స్వామిజి నిల్చుని గంభీరమైన గొంతుతో 'అమెరికా దేశపు సోదర సోదరీ మణులారా' అని పలకరించే సరికి ఆ ఒక్క పిలుపికి సభలో ఉన్న 4000 మందికి పైగా జనం లేచి 2 నిమిషాల పాటు ఆగకుండా చప్పట్లు కొట్టారట.

అప్పటి వరకు అందరు 'లేడీస్ అండ్ జెంటిల్ మెన్' అంటూ స్పీచ్ మొదలు పెట్టారు కానీ వివేకానంద సోదర సోదరీమణులారా అని పలకరించేసరికి ఆ పిలుపులో ఆత్మీయత వాళ్ళ హృదయాలను తాకింది. ఏ స్వార్థం లేని పిలుపుకి కొంతమంది కన్నీరు కూడా కార్చారు. ఆ చప్పట్ల శబ్దం ఆగిన తరువాత ఆయన భారతదేశ గొప్పతనం గురించి మన దేశంలో ఆధ్యాత్మికత, సనాతన దర్మం, సంస్కృతి, సంప్రదాయాల గురించి ప్రసంగించారు. దానితో సభ మొత్తం చప్పట్లతో మార-ంమోగిపోయింది. సభలో ఉన్న మేధావులు, గొప్ప గొప్ప వాళ్లంతా తమ స్థాయిని కూడా మర్చిపోయి చిన్న పిల్లల్లా ఎగబడుతూ స్టేజి వద్దకు వచ్చి స్వామిజీకి షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. అప్పటి వరకు భారత దేశం అంటే, మూఢ నమ్మకాలతో, చెట్లకు పుట్లకు పూజలు చేసే ఒక అనాగరికమైన దేశం అనే భావన ఉన్న వాళ్లందరికీ భారత దేశం పట్ల ఉన్న అపోహలను తొలగించారు. గౌరవం కలిగేలా చేసారు. భారత దేశపు స్థాయిని పెంచారు.

ఆ తరువాత కూడా చాలా కాలం పాటు దేశమంతా పర్యటిస్తూ ప్రసంగాలు చేస్తూ, రామకృష్ణ మఠాన్ని అభివృద్ధి చేస్తూ వచ్చారు. 1902 సంవత్సరం జులై 4 తేదీన రాత్రి 9 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు.

# సంక్రాంతికి ఊరెళ్లిన పట్నవాసులు

- **జాతీయ రహదారులపై వాహనాల బారులు**
- **టోల్‌గేట్ల వద్ద గంటలతరబడి క్యూలు**
- **నగరం నుంచి ప్రత్యామ్నాయా మార్గాల్లో పంపించిన పోలీసులు**
- **మెట్రో రైళ్లు ఫుల్.. బస్టాండ్లు కిటకిట**



**హైదరాబాద్/విజయవాడ, జనవరి 11 :** సంక్రాంతి పండగ సందర్భంగా నగరవాసులు వాహనాల్లో సొంతూళ్లకు క్యూకట్టడంతో.. దాదాపు అన్ని రూట్లల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఏటా ఇదేతంతు కనిపించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికితోడు విజయవాడ రహదారిలో రిపేర్లు కూడా వాహనదారులకు పరీక్ష పెట్టాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్డెక్కడంతో ఆయా ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. శనివారం నుంచి సెలవులు ప్రారంభం కావడంతో ఇటు విజయవాడ, అటు వరంగ్ల, ఇటు నిజామాబాద్రూట్లలో రద్దీ పెరిగింది. సొంత కార్లలో బయలుదేరిన వారికి ట్రాఫక్ జామ్ చీకాకు తెప్పించింది. టోల్‌గేట్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరుతున్నాయి. దీంతో టోల్‌గేట్ల వద్ద రద్దీ లేకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాహనాలను దారి మళ్లించారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో పండగ రద్దీ నివారణకు చర్యలు తీసుకున్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో హైదరాబాద్ నగరవాసులు స్వగ్రామాలకు బయలుదేరారు. వరుస సెలవులు ఉండటంతో సొంతూళ్లకు తరలివెళ్లారు. మరోవైపు పండగకు వెళ్లే వారితో మెట్రో రైళ్లలో రద్దీ నెలకొంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎల్బీనగర్, మియాపూర్, సికింద్రాబాద్, ఎంజీబీఎస్, జేబీఎస్ తదితర ప్రాంతాలకు చేరుకునేందుకు మెట్రో రైళ్లలో ప్రయాణిస్తున్నారు. మియాపూర్, రాయదుర్గం, జేఎన్టీయూ, అమీర్‌పేట్, ఎంజీబీఎస్, పరేడ్ గ్రౌండ్స్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, ఉప్పల్ తదితర స్టేషన్ల వద్ద రద్దీ నెలకొంది. సంక్రాంతి సెలవులు వచ్చాయంటే చాలు సొంతూళ్లకు పయనమవుతారు. ఈ క్రమంలో.. హైదరాబాద్-విజయవాడ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి పల్లెలకు వాహనాలు బారులు తీరాయి. ప్రతీసారి ఉన్నట్లే భారీ వాహనాల రద్దీతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. సంక్రాంతి సందర్భంగా సొంత ఊర్లకు పయనమైన వాహనాలతో టోల్ ప్లాజాల దగ్గర వాహనాల రద్దీ కొనసాగుతోంది. గత రాత్రి నుంచి ఇప్పటివరకు కూడా టోల్ గేట్స్ దగ్గర వాహనాల తాకిడి భారీగా ఉంది. జగ్గయ్యపేట దగ్గర చిలకల్లు, నందిగామ దగ్గర కీసర, గన్నవరం దగ్గర పొట్టిపాడు చెక్ పోస్టుల దగ్గర వాహనాల రద్దీ నెలకొంది. దీంతో సాధారణ రోజుల కంటే ఎక్కువ గేట్లను అందుబాటులో తెచ్చి వాహనాలను అనుమతి పంపిస్తున్నారు. రోజుకి సాధారణ రోజుల్లో 15 వేల వాహనాలు టోల్ గేట్ల నుంచి బయటకు వెళ్తుండగా.. ఇప్పుడు పండగ సీజన్ కావటంతో వాటి సంఖ్య 40,000 వరకు ఉంటుందని టోల్ గేట్ సిబ్బంది చెబుతున్నారు. వివిధ మార్గాల నుంచి వస్తున్న వాహనాలతో విజయవాడ నగరంలో ఫుల్ ట్రాఫిక్ జామ్ అవుతుంది.. ఇతర ప్రాంతాల నుంచి విజయవాడ వైపుకు వస్తున్న వాహనాలతో నగరంలోని ప్రధాన రహదారులు కిక్కిరిసిపోతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుపై రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి. వారధి వైపు నుంచి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, ఉభయ గోదావరి జిల్లాల వాహనాలు నగరంలోకి వస్తున్నాయి. అదే విధంగా హైదరాబాద్ హైవే నుంచి నగరంలోకి వచ్చి ఉభయ గోదావరి, విశాఖ వైపుకు భారీగా వాహనాలు తరలి వెళ్తున్నాయి. దీంతో వేల సంఖ్యలో వాహనాలు నగరం లోకి రావటంతో ట్రాఫిక్ తో రోడ్లు నిండిపోయాయి. ప్రయాణికులతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం ఉదయం రద్దీ పెరిగింది. అబ్దులాపూర్‌మెట్ ఓఆర్‌ఆర్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి కొత్తగూడెం వరకు వాహనాలు నెమ్మదిగా కదిలాన్నాయి. చౌటుప్పల్ పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. సిబ్బంది 10 టోల్‌బూత్‌ల ద్వారా ఏపీ వైపు వెళ్తున్న వారిని పంపిస్తున్నారు. హైదరాబాద్ వైపు వచ్చే వారిని 6 గేట్ల ద్వారా పంపిస్తున్నారు. చౌటుప్పల్ కూడలిలో అండర్‌పాస్ నిర్మాణ పనుల వల్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆదివారం కూడా రద్దీ మరింత పెరుగుతుందనే అంచనాలున్నాయి. రద్దీ దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాలను పోలీసులు సూచిస్తున్నారు. మరోవైపు ప్రయాణికులతో ఎంజీబీస్, జేబీఎస్, దిల్‌సుఖ్ నగర్ బస్టాండ్లు, ఎల్బీ నగర్ కూడలి రద్దీగా మారాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాలోని కీసర టోల్‌ప÷-లాజా వద్ద రద్దీ నెలకొంది. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. విజయవాడ వైపు వెళ్లే కార్లు, ఇతర వాహనాలతో నందిగామ వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వంతెన నిర్మాణం, అనుబంధ సర్వీస్ రోడ్డు నిర్మాణం కారణంగా రద్దీ పెరిగింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 12
జనవరి 2025





# వైడ్ బాల్ నిబంధనల్లో మార్పులు?

వైడ్ బాల్ నిబంధనల్లో మార్పులు చేయాలని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) భావిస్తుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. బ్యాటర్లకు ప్రయోజకరంగా ఉన్న ఈ నిబంధనల్లో మార్పులు చేసి బౌలర్లకూ బెనిఫిట్ దక్కేలా చేయాలనుకుంటోందని సౌతాఫ్రికా దిగ్గజ బౌలర్, ఐసీసీ క్రికెట్ కమిటీ మెంబర్ షాన్ పొలాక్ తెలిపాడు. ప్రస్తుతం ఉన్న రూల్స్ కారణంగా బౌలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అభిప్రాయపడ్డాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో బౌలర్ల లయను దెబ్బతీసేందుకు బ్యాటర్లు క్రీజులో కదులుతూ ఉంటారు. బంతి వేసే చివరి నిమిషంలో స్టాన్స్ మార్చుకోవడం.. ముందుకు రావడం.. పక్కకు జరగడం చేస్తూ వినూత్న షాట్స్ ఆడుతుంటారు. ఇలాంటి సమయాల్లో బౌలర్లు.. బంతిని స్టంప్స్‌కు దూరంగా వేస్తుంటారు. బంతి వైడ్ మార్క్ బయటగా వెళ్తే.. బ్యాటర్ మూవ్‌మెంట్‌ను పరిగణలోకి తీసుకోకుండా వైడ్ ఇస్తారు. అయితే ఈ విషయంలో మార్పులు తీసుకురావడంపై ఐసీసీ ఫోకస్ పెట్టిందని షాన్ పొలాక్ తెలిపాడు. 'ఐసీసీ క్రికెట్ కమిటీ మెంబర్‌గా వైడ్ బాల్ నిబంధనలను మార్చే అంశంపై వర్క్ చేస్తున్నా. బ్యాటర్లతో పాటు బౌలర్లకూ ప్రయోజనం కలిగేలా రూల్స్‌ను మారుస్తాం. ఇప్పుడున్న రూల్స్ చాలా కఠినంగా ఉన్నాయి. బౌలర్లకు నష్టం చేస్తున్నాయి. ఒకవేళ బ్యాటర్ చివరి నిమిషంలో క్రీజులో నుంచి బయటకు వెళ్తే బౌలర్ సరైన ప్రదేశంలో బంతిని వేయలేడు. రన్నప్ చేసే సమయంలోనే ఎక్కడ బంతిని వేయాలని నిర్ణయించుకుంటాడు. ఒకవేళ బ్యాటర్ కదిలినప్పుడు బంతి దూరంగా వెళ్తే.. అప్పుడు ఆ బ్యాటర్ ఎక్కడైతే ఉన్నాడో.. అక్కడి నుంచే బంతి దూరాన్ని పరిశీలనలోకి తీసుకోవాలి. అప్పుడే వైడ్‌పై ఓ నిర్ణయానికి రావాలి. మేం చేయాలనుకుంటున్న మార్పు ఇదే. ఇది ప్రస్తుతం చర్చల దశలో ఉంది. బౌలర్లకు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని ఇలా ఆలోచన చేశాం.'అని షాన్ పొలాక్ చెప్పుకొచ్చాడు.





# టీ20 పోరుకు టీమిండియా రెడీ !

భారత్-ఇంగ్లాండ్ మధ్య ఈ నెల 22 నుంచి మొదలయ్యే ఐదు టీ20ల సిరీస్‌కు బీసీసీఐ జట్టును ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో భారత జట్టు బరిలోకి దిగనుండగా.. ఈ టీ20 సిరీస్ కోసం బీసీసీఐ 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ఎంపిక చేసింది.

ఇక, ఇంగ్లండ్‌తో టీ20 పోరుకు సిద్ధమైన భారత జట్టులో ఇద్దరు తెలుగు ప్లేయర్లు తిలక్ వర్మ, నితీష్ రెడ్డిలకు కూడా చోటు దక్కించుకున్నారు. అలాగే, 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ తర్వాత చీలమండ గాయం కారణంగా జట్టుకు దూరమైన భారత స్టార్ పేసర్ మహ్మద్ షమీ తిరిగి జాతీయ జట్టులోకి అడుగుపెట్టాడు.

ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు ఇదే!

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, రింకు సింగ్, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), హర్షిత్ రాణా, అర్షిప్ సింగ్, మహ్మద్ షమీ, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్).

22న తొలి మ్యాచ్..

జనవరి 22న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్‌లో తొలి టీ20.
జనవరి 25న చెన్నైలో రెండో టీ20.
జనవరి 28న రాజకోట్‌లో మూడో టీ20.
జనవరి 31న పుణెలో నాలుగో టీ20.
ఫిబ్రవరి 2న ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఐదో టీ20 జరగనుంది.


# బిగ్ బాష్ లీగ్‌లో గ్లెన్ మ్యాక్స్‌వెల్ సరికొత్త రికార్డు



బిగ్ బాష్ లీగ్ 28వ మ్యాచ్‌లో గ్లెన్ మ్యాక్స్‌వెల్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగి హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. మెల్‌బోర్న్‌లోని ఎంసీజీ స్టేడియంలో సిడ్నీ సిక్సర్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో మెల్‌బోర్న్ స్టార్స్ తరపున ఆడిన మాక్స్‌వెల్ 32 బంతుల్లో 3 సిక్సర్లు, 5 ఫోర్లతో అజేయంగా 58 పరుగులు చేశాడు. ఈ 58 పరుగులతో గ్లెన్ మ్యాక్స్‌వెల్ బిగ్ బాష్ లీగ్‌లో 3000 పరుగులు పూర్తి చేశాడు. దీంతో బీబీఎల్‌లో ఈ ఘనత సాధించిన 5వ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. దీనితో పాటు బిగ్ బాష్ లీగ్ చరిత్రలో అత్యంత వేగంగా 3000 పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా కూడా మ్యాక్స్‌వెల్ రికార్డు సృష్టించాడు. గతంలో ఈ రికార్డు క్రిస్ లిన్ పేరిట ఉండేది. 2011 నుంచి బిగ్ బాష్ లీగ్‌లో ఆడుతున్న క్రిస్ లిన్ 2,016 బంతుల్లో 3000 పరుగులు పూర్తి చేశాడు. దీంతో బీబీఎల్‌లో అత్యంత వేగంగా 3000 పరుగుల మార్క్‌ను దాటిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ఇప్పుడు గ్లెన్ మాక్స్‌వెల్ కేవలం 1,955 బంతుల్లో 3000 పరుగులు పూర్తి చేసి సరికొత్త చరిత్ర సృష్టించాడు. బిగ్ బాష్ లీగ్ చరిత్రలో 2000 కంటే తక్కువ బంతుల్లో 3000 పరుగుల మార్కును దాటిన ఏకైక బ్యాట్స్‌మెన్ కూడా అతనే. బిగ్ బాష్ లీగ్‌లో ఇప్పటివరకు 110 ఇన్నింగ్స్‌లు ఆడిన గ్లెన్ మాక్స్‌వెల్ 2 సెంచరీలు, 19 అర్ధసెంచరీలతో మొత్తం 3047 పరుగులు చేశాడు. ప్రస్తుతం పరుగుల జాబితాలో 5వ స్థానంలో ఉన్న మ్యాక్స్‌వెల్, క్రిస్ లిన్ (3908)ను అధిగమించేందుకు 862 పరుగులు చేయాల్సి ఉంది.

# సెంచరీతో చెలరేగిన దేవదత్ పడిక్కల్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) బ్యాటర్ దేవదత్ పడిక్కల్(99 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్స్‌లతో 102) సెంచరీతో చెలరేగాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటకు ప్రాతినిథ్యం వహిస్తున్న దేవదత్ పడిక్కల్.. బరోడాతో శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సెంచరీ సాధించాడు. పడిక్కల్ శతకంతో ఈ మ్యాచ్‌లో కర్ణాటక 5 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కర్ణాటక నిర్ణీత 50 ఓవర్లో 8 వికెట్లకు 281 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్ సెంచరీకి తోడుగా అనీష్(64 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 52) హాఫ్ సెంచరీతో రాణించాడు. బరోడా బౌలర్లలో రాజ్ లింబాని, అతిత్ షేత్ మూడేసి వికెట్లు తీయగా.. కృనాల్ పాండ్యా, మెరివాలా తలో వికెట్ పడగొట్టారు. అనంతరం బరోడా 49.5 ఓవర్లలో 276 పరుగులకు కుప్పకూలింది. శేశ్వాత్ రావత్(126 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 104) సెంచరీతో.. అతిత్ షేత్(59 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 56) హాఫ్ సెంచరీతో రాణించినా ఫలితం లేకపోయింది. కర్ణాటక బౌలర్లలో వాసుకి కౌశిక్, ప్రసిధ్ కృష్ణ, అభిలాష్ శెట్టి, శ్రేయస్ గోపాల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. సెంచరీతో కర్ణాటక విజయంలో కీలక పాత్ర పోషించిన దేవదత్ పడిక్కల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో దేవదత్ పడిక్కల్‌ను ఆర్‌సీబీ అతని కనీస ధర రూ. 2 కోట్లకు కొనుగోలు చేసింది. ముందుగా పడిక్కల్‌ను తీసుకునేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపలేదు. వేలం చివర్లో మరోసారి అతని పేరును వేలంలో ఉంచగా ఆర్‌సీబీ కనీస ధరకు కొనుగోలు చేసింది. ఆర్‌సీబీతోనే దేవదత్ పడిక్కల్ ప్రొఫెషనల్ కెరీర్ ప్రారంభించిన విషయం తెలిసిందే.






# రెండో పెళ్లికి సిద్ధమవుతున్న సానియా

## తెలుగు హీరోతో డేటింగ్ చేస్తోందని పుకార్లు

భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మరోసారి వార్తల్లో నిలిచింది. 14 ఏళ్ల క్రితం పాకిస్థాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్‌తో వివాహ బంధం పడి తర్వాత విడాకులు తీసుకున్న ఈ టెన్నిస్ క్వీన్, ప్రస్తుతం తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతోందని టాలీవుడ్ వర్గాల్లో పుకార్లు షికారు చేస్తున్నాయి. షోయబ్ మాలిక్ మరొక మహిళతో ప్రేమలో ఉన్నారని తెలుసుకున్న సానియా, విడాకులు తీసుకుని ఒంటరిగా జీవించడాన్ని ఎంపిక చేసుకుంది. ఆమె కుమారుడు ఇజాన్‌తో సహా తన వ్యక్తిగత జీవితంలో కొత్త విషయాన్ని వెతుక్కుంటోంది. అయితే, ప్రస్తుతం ఒక తెలుగు స్టార్ హీరోతో సానియా డేటింగ్ చేస్తున్నట్లు పుకార్లు జోరుగా వినిపిస్తున్నాయి. టాలీవుడ్ సర్కిల్స్‌లో ఈ హీరో ఎవరు అనే చర్చ ఎక్కువగా సాగుతోంది. అభిమానులు ఈ సంబంధం పెళ్లికి దారితీయబోతుందని నమ్ముతున్నారు. సానియా ఇంకా ఈ వార్తలపై స్పందించకపోయినా, భవిష్యత్ ప్రణాళికల గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఇక, షోయబ్ మాలిక్ తన రెండో పెళ్లితో ముందుకు సాగాడు. అతను ప్రముఖ పాకిస్థానీ నటి సనా జావేద్‌ను వివాహం చేసుకున్నాడు, ఇది ఆమెకు కూడా రెండో పెళ్లే. సనా జావేద్, షోయబ్ తమ వివాహ బంధంతో కొత్త జీవితాన్ని మొదలుపెట్టగా, సానియా తన కొత్త జీవిత భాగస్వామితో ఒక కొత్త ప్రయాణానికి సిద్ధమవుతోందని సమాచారం. సానియా జీవితంలోని ఈ కొత్త మలుపు ఆమెకు సంతోషం తెచ్చి, అభిమానులకు మరింత ఉత్కంఠ రేకెత్తిస్తోంది. పెళ్లి వార్తలు నిజమా పుకార్లా అనే దానిపై త్వరలో క్లారిటీ రావొచ్చని అందరూ ఆశిస్తున్నారు.

# ఐదు మ్యాచుల్లో ఏడు వికెట్లు

## నిలకడగా రాణిస్తోన్న పేసర్ ముకేశ్ చౌదరి



విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్ లో పంజాబ్, మహారాష్ట్ర మధ్య తలపడ్డాయి. అయితే వడోదరాలోని కొతంబి స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో సీఎస్కే పేసర్, మూడు హ్యాట్రిక్ సెంచరీలతో జోరు మీదున్న పంజాబ్ బ్యాటర్ ను బోల్తా కొట్టించాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో తెగ వైరల్ అవుతోంది. టీమ్‌ఇండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న పంజాబ్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ విజయ్ హజారే ట్రోఫీలో దుమ్మురేపుతున్న సంగతి తెలిసిందే. రీసెంట్ గానే హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రభ్‌సిమ్రన్ (137బీ 105 బంతుల్లో 20 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతక్కొట్టాడు. అంతకుముందు గత రెండు మ్యాచ్‌ల్లో.. ముంబయిపై (150లి), సౌరాష్ట్రపై (125) సెంచరీలు బాదాడు. అలా వరుసగా మూడో సెంచరీలతో చెలరేగి ఆడాడు. అయితే ప్రస్తుతం జరుగుతోన్న విజయ్ హజారే ట్రోఫీలో పంజాబ్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ ను బోల్తా కొట్టించాడు చెన్నై సూపర్ కింగ్స్ పేసర్ ముకేశ్ చౌదరి. తన సూపర్ బౌలింగ్‌తో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో జోరు మీదున్నప్రభ్‌సిమ్రన్ ను ఔట్ చేశాడు. ఈ మ్యాచ్ పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్ నాలుగో ఓవర్ లో అతడు పెవిలియన్ చేరాడు. ముకేశ్ పర్ఫెక్ట్ ఔట్ సింగ్ ను సంధించగా, ప్రభ్‌సిమ్రన్ సింగ్ డ్రైవ్ ఆడబోయి ఔట్ అయ్యాడు. బంతి స్వింగ్ అయి ఆఫ్ స్టంప్ మీదుగా వెళ్లింది. దీంతో ఈ రైట్ హ్యాండ్ బ్యాటర్ కేవలం 17 బంతుల్లో 14 పరుగులకే వెనుదిరిగాడు. ముకేశ్ తీసిన వికెట్‌తో మహారాష్ట్ర ప్రభ్‌సిమ్రన్ సింగ్ దాడి నుంచి తప్పించుకుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోనే బీసీసీఐ డొమాస్టిక్ క్రికెట్ తన ఎక్స్ హ్యాండిల్ లో పోస్ట్ చేసింది. ముకేశ్ వేసిన బంతి అదిరింది అంటూ రాసుకొచ్చింది. ముకేశ్ చౌదరి తన ఆరు ఓవర్లలో మూడు వికెట్లు తీశాడు. తన గత ఐదు మ్యాచుల్లో కలిపి ఏడు వికెట్లు దక్కించుకున్నాడు. అంతకుముందు సయ్యద్ ముస్తక్ అలీ ట్రోఫీ టీ20 టోర్నమెంట్ లో మొత్తం 15 వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. కాగా, ఐపీఎల్ మెగా వేలంలో సీఎస్కే ముకేశ్ చౌదరిని రూ.3 కోట్లకు దక్కించుకుంది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ ను పంజాబ్ రూ.4 కోట్లకు కొనుగోలు చేసింది..

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News



## సౌత్ వాళ్లు ఆ పనైనా మానేస్తారు కానీ.. సినిమాలు చూడటం మానరు : రాశిఖన్నా

'ది సబర్మతి రిపోర్ట్' సినిమాతో ఇటీవల సూపర్ హిట్ అందుకుంది నటి రాశి ఖన్నా. ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేసిన ఈ భామ ప్రస్తుతం బాలీవుడ్‌కి షిఫ్ట్ అయిన విషయం తెలిసిందే. షాహిద్ కపూర్ నటించిన ఫర్జీతో పాటు విక్రాంత్ మస్సే 'ది సబర్మతి రిపోర్ట్' చిత్రాలతో మంచి హిట్లు అందుకుంది. ప్రస్తుతం తెలుగులో సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న తెలుసుకదా సినిమాతో పాటు తమిళంలో అగాథియా అనే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో నటిస్తుంది ఈ భామ. అయితే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ అమ్మడు సౌత్ సినిమా అభిమానులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. రాశి మాట్లాడుతూ.. దక్షిణాదిలో సినిమా అభిమానులు ఎక్కువ అక్కడ హీరోలని దేవుడి లాగా కోలుస్తారు. సినిమా విడుదల అప్పుడు పండుగల భావిస్తారు. అందుకే సౌత్‌లో ప్రేక్షకులు తిండి అయిన మానేస్తారు ఏమో కానీ సినిమాలు చూడడం మాత్రం ఆపారు. అదే నార్త్‌లో ప్రజలు సినిమాలు పక్కన పెట్టి మిగతా వాటికి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తారు. ఆ తర్వాత సినిమాలు చూస్తారు అంటూ రాశి ఖన్నా చెప్పుకోచ్చింది.


## ఆ నొప్పులు సరదాగా ఉంటాయ్ : సమంత

టాలీవుడ్ హీరోయిన్ సమంత.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. తనకు సంతోషం కలిగినా, బాధ కలిగినా.. ప్రతీ విషయాన్ని ఆమె తన అభిమానులతో సోషల్ మీడియాలో పంచుకుంటుంది. అలానే తాజాగా సమంత సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఇటీవల తాను చికెన్ గున్యా వ్యాధి బారిన పడినట్లు సమంత తెలిపింది. అయితే ప్రస్తుతం ఆ వ్యాధి నుంచి కోలుకుంటున్నట్టు ఆమె వెల్లడించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ జిమ్‌లో వర్కౌట్స్ చేస్తున్న ఓ వీడియోను సమంత్ షేర్ చేసింది. చికెన్ గున్యా వల్ల వచ్చిన కీళ్లనొప్పులు నుంచి కోలుకోవడం అనేది చాలా ఫన్‌గా ఉంటుందంటూ ఆ బ్యూటీ రాసుకొచ్చారు. సమంత త్వరగా కోలుకోవాలంటూ ఆమె అభిమానులు కోరుకుంటున్నారు. గతంలో సమంత మయోసైటిస్ అనే వ్యాధి బారిన పడిన సంగతి తెలిసిందే. ఖుషి మూవీ టైమ్‌లో తాను ఈ వ్యాధి బారిన పడినట్లు ఆమె తెలిపింది. అప్పట్నుంచి తన ఆరోగ్యం క్షీణించిందని చెప్పింది. మయోసైటిస్ చికిత్స కోసం మెడిసిన్స్, ఆయుర్వేదం, భూటాన్‌లో ప్రకృతి వైద్యం ఇలా రకరకాల పద్ధతుల్ని సమంత ప్రయత్నించింది.



## అందాల నిక్కీ జీన్స్‌లో బోల్డ్

తెలుగు ప్రేక్షకులకు చీకటి గదిలో చితక్కొట్టుడు అనే సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ నిక్కీ తంబోలి. ఆ తర్వాత ఎక్కువ సినిమాలు చేయకున్నా సోషల్ మీడియాలో ఈ అమ్మడు రెగ్యులర్‌గా అందమైన ఫోటోలు షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతోంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం కావడంతో సోషల్ మీడియాలో ఈమె ఫాలోయింగ్ అంతకంతకు పెరుగుతూ ఉంది. ఈమధ్య కాలంలో ఈ అమ్మడు మరోసారి అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా చలికాలంలో వేడి పెంచినట్లు అయ్యింది. ఈమె అందాల ఆరబోత ఈసారి కాస్త ఎక్కువ అయ్యిందని కొందరు అంటున్నారు.  సినిమా ఇండస్ట్రీలో పెద్దగా సినిమాలు చేయకున్నా ఈమె చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. ముఖ్యంగా ఈ అమ్మడు స్కిన్ షో చేస్తూ షేర్ చేస్తున్న ఫోటోలు ఓ రేంజ్‌లో ఉంటున్నాయి. ఈ స్థాయిలో అందాల ఆరబోత చేసినా, ఇంత అందంగా ఉన్నా ఎందుకు సినిమాల్లో ఎక్కువ ఆఫర్లు రావడం లేదు అంటూ కొందరు ఆశ్చర్యంగా కామెంట్స్ చేస్తున్నారు. బోల్డ్ లుక్‌లోనూ చాలా అందంగా కనిపించడం కేవలం నిక్కీ తంబోలికే చెల్లుతుంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా నిక్కీ అందాల ఆరబోత ఫోటోల గురించి మరోసారి చర్చించుకునే విధంగా ఈ ఫోటోలు ఉన్నాయి. వైట్ టాప్ వేసి నడుము అందాన్ని చూపిస్తూ నాభి అందంతో మతి పోగొట్టడం మాత్రమే కాకుండా జీన్స్ వేసుకుని కవ్వించే విధంగా ఈ అమ్మడు ఇచ్చిన ఫోజ్ చూపు తిప్పనివ్వడం లేదు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా కాలం అయినా చేసినవి చాలా తక్కువ సినిమాలు. అయినా ఈ అమ్మడికి దక్కిన గుర్తింపు తక్కువేం కాదు. ఈ అమ్మడు సోషల్ మీడియాలో స్టార్ హీరోయిన్స్‌కి ఏమాత్రం తక్కువ కాకుండా అందాల ఆరబోత చేస్తూ ఉంటుందని ఈ ఫోటోలతో మరోసారి నిరూపితం అయ్యింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫేస్ ఎక్స్‌ప్రెషన్స్ ఈ అమ్మడి సొంతం. అందుకే ఈమె ఫోటోలకు మంచి ఫాలోయింగ్ దక్కుతుంది.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986